23-12-2025

# విశాల భారతి

తెలుగు దినపత్రిక

www.vishalabharati.com
epaper.vishalabharati.com

మంగళవారం, హైదరాబాద్ సంపుటి:3 సంచిక: 353


## రేవంత్ రెడ్డి ఓ స్ట్రీట్ రౌడీ

- కాంగ్రెస్-బీఆర్ఎస్ నేతల మధ్య మాటల తూటాలు పేలుతున్నాయి
- కేసీఆర్ వ్యాఖ్యలకు పలువురు మంత్రులు కౌంటర్లు ఇచ్చారు
- బీఆర్ఎస్ సీనియర్ ఎమ్మెల్యే హరీష్ రావు స్పందించారు
- తెలంగాణ భవన్‌లో నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో కీలక వ్యాఖ్యలు చేశారు
- కృష్ణా నీళ్లను తాకట్టు పెట్టిందే కాంగ్రెస్ పార్టీ అని ఆయన ఆరోపించారు
- రేవంత్ పాలనలో అతి తక్కువ నీటి వినియోగం జరిగింది అని అన్నారు



**విశాలభారతి, స్టేట్ బ్యూరో:** మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదివారం నాడు మీడియాతో మాట్లాడిన తర్వాత రాష్ట్రంలో రాజకీయ వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది. కాంగ్రెస్ - బీఆర్ఎస్ నేతల మధ్య మాటల తూటాలు పేలుతున్నాయి. కేసీఆర్ వ్యాఖ్యలకు పలువురు మంత్రులు కౌంటర్లు ఇవ్వగా, వారికి కౌంటర్‌గా మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ ఎమ్మెల్యే హరీష్‌రావు స్పందించారు. కృష్ణా నీళ్లను తాకట్టు

మిగతా 2లో..

# కేసీఆర్ సెంటిమెంట్ అస్త్రం..
# రేవంత్ అసెంబ్లీ అస్త్రం..

## బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ చాలా కాలం తర్వాత బయటకొచ్చాడు

### అయితే కేసీఆర్ మరోసారి సెంటిమెంట్ రాజకీయాలనే ఆశ్రయించారు

ఆంధ్రప్రదేశ్ ఏర్పాటే తెలంగాణకు శాపం అంటూ వ్యాఖ్యానించారు
పాలమూరు జిల్లా తీవ్ర వివక్షకు గురైందని తీవ్రస్థాయిలో మండిపడ్డారు
ఈ వ్యాఖ్యలపై సీఎం రేవంత్ రెడ్డి చాలా వేగంగా స్పందించారు
అసెంబ్లీ సమావేశాల్లో చర్చించేందుకు రావాలని సవాల్ చేశారు
ముఖాముఖి తేల్చుకుందాం రమ్మని సవాల్ విసిరారు
ఇప్పుడు కేసీఆర్ అసెంబ్లీకి రావాల్సిన పరిస్థితి ఏర్పడింది



**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

కేసీఆర్ చాలా కాలం తర్వాత బయటకొచ్చాడు. తెలంగాణ భవన్‌కు వచ్చి పార్టీపై , కాంగ్రెస్ ప్రభుత్వంపై సమీక్షించారు. వరుస ఎన్నికల్లో ఎదురైన పరాజయాలు,పార్టీ లోపల పెరుగుతున్న అసంతృప్తి నేపథ్యంలో బీఆర్ఎస్‌కు మళ్లీ ఊపిరి పోయాలన్న ఉద్దేశంతో కేసీఆర్ రంగంలోకి దిగినట్లు కనిపిస్తోంది. వ్యవసాయ క్షేత్రం నుంచి నేరుగా శనివారం రాత్రి నందినగర్‌కు చేరుకున్న కేసీఆర్, ఆదివారం పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ఎంపీలు, సీనియర్ నేతలతో కీలక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముందే ఎలాంటి అంశాలు చర్చకు రానున్నాయో గులాబీ పార్టీ మీడియాకు సంకేతాలు పంపింది.

సమావేశంలో కేసీఆర్ మరోసారి సెంటిమెంట్ రాజకీయాలనే ఆశ్రయించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఏర్పాటే తెలంగాణకు శాపం అంటూ వ్యాఖ్యానించడం రాజకీయంగా పెద్ద చర్చకు దారితీసింది. సమైక్య రాష్ట్రంలో ఉమ్మడి పాలమూరు జిల్లా తీవ్ర వివక్షకు గురైందని పాలమూరురంగారెడ్డి జిల్లాలకు రావాల్సిన 174 టీఎంసీల నీరు ఇప్పటికీ అందడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్సీ యాక్ట్ ను కూడా పట్టించుకోలేదని మండిపడ్డారు. వాస్తవానికి పాలమూరు, రంగారెడ్డి జిల్లాలకు నీటి అన్యాయం అంశంపై మాట్లాడితే పెద్దగా వివాదం ఉండేది కాదు. కానీ ఏపీ ఏర్పాటు మొత్తాన్నే తెలంగాణకు అన్యాయంగా చిత్రీకరించడం ద్వారా కేసీఆర్ మళ్లీ సెంటిమెంట్ రాజకీయాల దారినే ఎంచుకున్నారని అర్థమవుతోంది.

గులాబీ పార్టీ 2014, 2018 ఎన్నికల్లో తెలంగాణ సెంటిమెంట్ ను బలంగా రగిలించి అధికారాన్ని దక్కించుకుంది. కానీ 2023 అసెంబ్లీ ఎన్నికల్లో అదే వ్యూహం పనిచేయలేదు. 2024 పార్లమెంట్ ఎన్నికల్లో స్వయంగా కేసీఆర్ ప్రచారం చేసినా ఫలితం లేకుండా పోయింది. పార్టీ చరిత్రలో తొలిసారిగా బీఆర్ఎస్ కు ఒక్క ఎంపీ సీటు కూడా రాలేదు. ఇటీవల జూబ్లిహిల్స్, కంటోన్మెంట్ ఉప ఎన్నికలు, అలాగే పంచాయితీ ఎన్నికల్లో కూడా గులాబీ పార్టీ ఆశించిన స్థాయిలో ఫలితాలు సాధించలేకపోయింది. మరికొద్దిరోజుల్లో జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలకు ప్రభుత్వం కసరత్తు చేస్తుండడంతోనే కేసీఆర్ మళ్లీ రాజకీయంగా యాక్టివ్ అయ్యారని పార్టీ వర్గాలు చెబుతున్నాయి.సమావేశంలో ఆయన కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. ఒకప్పుడు 'యూరియా ఇంటికే వచ్చేది. ఇప్పుడు కుటుంబమంతా లైన్లో నిలబడాల్సిన పరిస్థితి నెలకొందని విమర్శించారు. కొత్త పథకాలు లేవు, ఉన్నవాటినే ఆపేస్తున్నారు. రైతుల కోసం కట్టిన చెక్‌డ్యామ్‌లను పేల్చేస్తున్నారు. పంచాయతీ ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు బుద్ధి చెప్పారు. అలాగే "మేము అధికారంలో ఉన్నప్పుడు అహంకారం ప్రదర్శించలేదు. పార్టీ గుర్తులతో జరిగే ఎన్నికలైతే గులాబీ పార్టీ సత్తా తెలిసేది" అంటూ ఆయన వ్యాఖ్యానించారు.

చాలా రోజుల తర్వాత పార్టీ కార్యాలయానికి వచ్చిన కేసీఆర్ ఒక కొత్త రాజకీయ వ్యూహం ప్రకటించారు. మళ్లీ సెంటిమెంట్ రాజకీయాలు రాజేశారు.. ఏపీ ఏర్పాటు తెలంగాణకు శాపం అన్న కేసీఆర్ వ్యాఖ్యలను ప్రజలు ఎంతవరకూ విశ్వసిస్తారన్నది ఆసక్తికరంగా మారింది. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లోనే సెంటిమెంట్ రాజకీయాలకు ఇంకా బలం ఉందా? ప్రజలు కొత్త రాజకీయ దిశను కోరుకుంటున్నారా? అన్న ప్రశ్నలకు సమాధానం దొరకనుంది. తెలంగాణ మాజీ సీఎం , బీఆర్ఎస్ చీఫ్ కేసీఆర్ కృష్ణా జలాల విషయంలో చేసిన ఆరోపణలపై రేవంత్ రెడ్డి చాలా వేగంగా స్పందించారు.

మిగతా 3లో..

## స్వేచ్ఛా బంధం

- భారత్-న్యూజిలాండ్ మధ్య స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం
- న్యూజిలాండ్ ప్రధానమంత్రి క్రిస్టోఫర్ లక్సన్‌తో మోదీ సంభాషణ
- ఇరుదేశాల నాయకులు స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాన్ని ప్రకటించారు
- మార్చిలో న్యూజిలాండ్ ప్రధాని లక్సన్ భారత పర్యటనకు వచ్చారు
- ఆ సమయంలో దేశాల మధ్య చర్చలు ప్రారంభమయ్యాయి
- రాబోయే 15 ఏళ్లలో 20 మిలియన్ డాలర్ల పెట్టుబడులు పెట్టనుంది



03

## కేసీఆర్ తోలు మాటలు ఆపు

- కేసీఆర్‌పై కాంగ్రెస్ మంత్రులు ఎదురుదాడికి దిగారు
- మంత్రి జూపల్లి, పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి మాట్లాడారు
- బీఆర్ఎస్ కండలన్నీ కరిగి తోలు మాత్రమే మిగిలిందన్నారు
- కేసీఆర్ తోలు తీస్తానని మాట్లాడుతున్నాడని ఎద్దేవా చేశారు
- బీఆర్ఎస్ ప్రతిష్ట దిగజారిందని కేసీఆర్‌కు అర్థమైందిని అన్నారు
- పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టను ఎందుకు పూర్తి చేయలేదని నిలదీశారు

03

## ఈనెల 29 నుంచి అసెంబ్లీ సమావేశాలు

సీఎం రేవంత్ రెడ్డి మంత్రులతో సమావేశం నిర్వహించారు
పంచాయతీ ఎన్నికల ఫలితాలపై మంత్రులనుఅభినందించారు
రానున్న ఎన్నికల్లోనూ ఇదే ఉత్సాహం చూపాలని అన్నారు
గ్లోబల్ సమ్మిట్ సక్సెస్ పై సమావేశంలో చర్చ జరిగింది
జీహెచ్ఎంసీలో మున్సిపాలిటీల విలీనంపై చర్చ జరిగింది
సభలోకి ప్రభుత్వ బిల్లులను ప్రవేశ పెట్టనున్నట్లు సమాచారం



**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

పంచాయతీ ఎన్నికల ఫలితాలపై మంత్రులను సీఎం రేవంత్ రెడ్డి అభినందించారు. 3 గంటలపాటు మంత్రులతో సీఎం సమావేశం సాగింది. జడ్పీటీసీ, ఎంపీటీసీ, జీహెచ్ఎంసీ ఎన్నికల్లోనూ ఇదే ఉత్సాహం చూపాలని రేవంత్ అన్నారు. అన్ని జడ్పీ పీఠాలను క్లీన్‌స్వీప్ చేయాలన్నారు. ఎన్నికల నిర్వహణపై త్వరలో నిర్ణయం తీసుకుంటామని రేవంత్ అన్నారు. అసెంబ్లీ సమావేశాలు నిర్వహించాలని సమావేశంలో తీర్మానం చేశారు. గ్లోబల్ సమ్మిట్ సక్సెస్ పై సమావేశంలో చర్చ జరిగింది. మంత్రుల సమావేశంలో జీహెచ్ఎంసీలో మున్సిపాలిటీల విలీనంపై చర్చ జరిగింది. డివిజన్ల ఏర్పాటుపై మంత్రులకు సీఎం రేవంత్ వివరించారు. ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రులదే బాధ్యతన్న రేవంత్.. సర్పంచ్ ఎన్నికల్లో ప్రభుత్వానికి ప్రజల పూర్తి మద్దతు లభించిందన్నారు. పంచాయతీ ఎన్నికల్లో కొందరు కొన్ని పొరపాట్లు చేశారని.. వాటిని ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల్లో పునరావృత్తం కాకుండా చూసుకోవాలంటూ హెచ్చరించారు. ఈ నెల 29న అసెంబ్లీ సమావేశం కానుంది. జనవరి 2 నుంచి సమావేశాలను ప్రభుత్వం కొనసాగించనుంది. సమావేశాల్లో ఎంపీటీపీ, జెడ్పీటీసీ ఎన్నికలపై చర్చించనున్నారు. ఇరిగేషన్ ప్రాజెక్టులపై కూడా చర్చ జరగనుంది. సభలోకి ప్రభుత్వ బిల్లులను ప్రవేశపెట్టనున్నట్లు సమాచారం. ప్రధానంగా గోదావరి కృష్ణా జలాల ఎజెండాగా ఈ సమావేశాలు కొనసాగనున్నాయి. ఇటీవల ముగిసిన సర్పంచ్ ఎన్నికల్లో ప్రభుత్వానికి ప్రజల నుండి పూర్తి మద్దతు లభించిందని ముఖ్యమంత్రి ఈ సందర్భంగా సంతృప్తి వ్యక్తం చేశారు. అయితే, పంచాయతీ ఎన్నికల సమయంలో జరిగిన కొన్ని పొరపాట్లను ప్రస్తావిస్తూ, రాబోయే ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల్లో అవి పునరావృతం కాకుండా

మిగతా 2లో..



## ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక పరిణామం

- తెలంగాణలో సంచలనం రేపిన ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక పరిణామం
- మాజీ ఇంటలిజెన్స్ చీఫ్ నవీన్ చంద్‌తో పాటు సిట్ విచారణ చేసింది
- అభ్యంతరాలు తెలిపేందుకు ఇచ్చిన గడువు ముగిసిందని గుర్తు చేసింది
- ట్యాపింగ్ రివ్యూ కమిటీలోని వారిని సిట్ మరోసారి విచారించింది
- మరోసారి నోటీసులు జారీ చేయటం ఇప్పుడు సంచలనంగా మారుతోంది
- ముగ్గురు మాజీ ఐఏఎస్‌లతోపాటు మాజీ ఐపీఎస్‌లను సాక్షులుగా విచారించింది

02

## డీలిమిటేషన్‌కు మార్గం సుగమం

- జీహెచ్ఎంసీ డీలిమిటేషన్‌పై దాఖలైన 80 పిటిషన్లను హైకోర్టు కొట్టి వేసింది
- ప్రస్తుత పరిస్థితుల్లో జోక్యం చేసుకోలేమని హైకోర్టు తెలిపింది
- అభ్యంతరాలు తెలిపేందుకు ఇచ్చిన గడువు ముగిసిందని గుర్తు చేసింది
- వార్డుల సంఖ్యను 300కు పెంచుతూ డీలిమిటేషన్ ఉత్తర్వులు జారీ

02

## జర్నలిస్టులకు గుడ్ న్యూస్

- జర్నలిస్టులకు ప్రభుత్వం గుడ్ న్యూస్ తెలిపింది
- అక్రెడిటేషన్ విధానాన్ని పునఃసమీక్షించేందుకు శ్రీకారం
- ఈ మేరకు నూతన నిబంధనలను విడుదల చేసింది
- జీవో ఎంఎస్ నంబర్ 252ను సోమవారం జారీ చేసింది
- 2016 అక్రెడిటేషన్ నిబంధనలను తాజీ జీవోతో రద్దు చేశారు
- ప్రత్యేక కమిటీ సిఫారసుల మేరకు ఈ నిర్ణయం



**విశాలభారతి, స్టేట్ బ్యూరో:** తెలంగాణ జర్నలిస్టులకు ప్రభుత్వం గుడ్ న్యూస్ తెలిపింది. తెలంగాణ రాష్ట్రంలో మీడియా ప్రతినిధులకు అక్రెడిటేషన్ విధానాన్ని సమగ్రంగా పునఃసమీక్షిస్తూ ప్రభుత్వం నూతన నిబంధనలను విడుదల చేసింది. తెలంగాణ మీడియా అక్రెడిటేషన్ నిబంధనలు -2025 పేరిట సాధారణ పరిపాలన జీవో ఎంఎస్ నంబర్ 252ను సోమవారం జారీ చేసింది. నూతన నిబంధనలు జీవో జారీ చేసిన తేదీ నుంచి అమల్లోకి వచ్చినట్టు ప్రభుత్వం తెలిపింది. ఇప్పటి వరకూ అమల్లో ఉన్న 2016 నాటి అక్రెడిటేషన్ నిబంధనలను తాజీ జీవోతో రద్దు చేశారు. తాజా మార్పులకు అనుగుణంగా కొత్త నిబంధనలు రూపొందించారు. కొత్త కార్డులు జారీ అయ్యేంత వరకూ ఇప్పటి వరకూ ఉన్నవి కొనసాగుతాయి. తెలంగాణ మీడియా అకాడమీ ఛైర్మన్ అధ్యక్షతన ఏర్పాటైన ప్రత్యేక కమిటీ సిఫారసుల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నారు.

మిగతా 2లో..

# జర్నలిస్టులకు గుడ్ న్యూస్




( మొదటిపేజీ తరువాయి )

కొత్త నిబంధనల ప్రకారం రాష్ట్ర స్థాయిలో స్టేట్ మీడియా అక్రెడిటేషన్ కమిటీ , ప్రతి జిల్లాలో డిస్ట్రిక్ట్ మీడియా అక్రెడిటేషన్ కమిటీ ఏర్పాటు చేయనున్నారు. రాష్ట్ర స్థాయి అక్రెడిటేషన్లు ఎస్‌మాక్ ద్వారా, జిల్లా, నియోజకవర్గం, మండల స్థాయి అక్రెడిటేషన్లు డీఎంఏసీ ద్వారా మంజూరు చేస్తారు. ఈ కమిటీల కాలపరిమితి రెండేళ్లు. కమిటీల్లో సభ్యులుగా ఉండేందుకు అనుభవాన్ని కీలకంగా పరిగణించారు. పెద్ద దినపత్రికల ప్రతినిధులకు కనీసం 10 ఏళ్ల అనుభవం, మధ్యస్థ, చిన్న దినపత్రికలకు 5 ఏళ్ల అనుభవం తప్పనిసరి చేశారు. ఎలక్ట్రానిక్ మీడియా, ఫోటో, వీడియో జర్నలిస్టులకు కూడా ప్రత్యేక అర్హతలు నిర్దేశించారు. మహిళా జర్నలిస్టులకు ప్రత్యేక ప్రాతినిధ్యం కల్పించారు. అక్రెడిటేషన్ వ్యక్తిగతమని, ఇతరులకు బదిలీ చేయలేనివని నిబంధనల్లో స్పష్టం చేశారు. అక్రెడిటేషన్ కార్డు ప్రత్యేక హోదా కల్పించినట్టు కాదని పేర్కొన్నారు. డెస్క్ జర్నలిస్టులకు మీడియా కార్డులు, ఫీల్డ్ రిపోర్టర్లకు అక్రెడిటేషన్ కార్డులు ఇస్తారు. రెండింటికీ కాలపరిమితి రెండేళ్లు. దినపత్రికలు కనీసం ఐదు రోజుల ప్రచురణ, 50 శాతం వార్తా కంటెంట్, పీఆర్‌జీఐ లేదా ఆర్ఎన్ఐ రిజిస్ట్రేషన్ తప్పనిసరి. వారపత్రికలు, పక్షపత్రికలు, మాసపత్రికలకు కూడా సర్క్యులేషన్, కంటెంట్ పరంగా స్పష్టమైన అర్హతలు పెట్టారు.ఎలక్ట్రానిక్ మీడియాలో శాటిలైట్ న్యూస్ ఛానెల్స్‌కు కేంద్ర ఐఅండ్‌బీ శాఖ అనుమతి ఉండాలి. లోకల్ కేబుల్ న్యూస్ ఛానెల్స్ రోజుకు కనీసం మూడు వార్తా బులిటిన్లు ప్రసారం చేయాలి. డిజిటల్ న్యూస్ మీడియాకు తొలిసారిగా కఠినమైన ప్రమాణాలు విధించారు. వెబ్‌సైట్ కనీసం ఏడాది పనిచేసి ఉండాలి. గత ఆరు నెలలుగా నెలకు కనీసం 5 లక్షల యూనిక్ విజిటర్లు ఉండాలి. డిజిటల్ మీడియాలో గరిష్టంగా 10 అక్రిడిటేషన్ కార్డులకే పరిమితి విధించారు. న్యూస్ అగ్రిగేటర్లకు అక్రిడిటేషన్ ఇవ్వబోమని స్పష్టం చేశారు. 15 ఏళ్ల అనుభవం ఉన్న ఫ్రీలాన్సర్లు, 30 ఏళ్ల అనుభవంతో పాటు 58 ఏళ్లు నిండిన వెటరన్ జర్నలిస్టులు కూడా కార్డులకు దరఖాస్తు చేసుకోవచ్చు.తప్పుడు సమాచారం ఇవ్వడం, అనైతిక ప్రవర్తన, నేరాలకు పాల్పడినట్టు తేలితే అక్రిడిటేషన్‌ను నిలిపివేయడం లేదా రద్దు చేసే అధికారం కమిటీలకు ఉంది. అక్రిడిటేషన్ తిరస్కరణ లేదా రద్దుపై జిల్లా స్థాయిలో కమిషనర్‌కు, రాష్ట్ర స్థాయిలో ఐఅండ్‌పీఆర్ శాఖ కార్యదర్శికి అప్పీల్ చేసుకునే అవకాశం కల్పించారు. నూతన నిబంధనల అమలుకు అవసరమైన చర్యలు చేపట్టాలని సమాచార, ప్రజాసంబంధాల శాఖ ప్రత్యేక కమిషనర్‌ను ప్రభుత్వం ఆదేశించింది. అక్రిడిటేషన్ అంశాల్లో ప్రభుత్వ నిర్ణయమే తుది నిర్ణయమని జీఓలో పేర్కొన్నారు.

స్టేట్ లెవల్ అక్రెడిటేషన్ కోసం డిగ్రీ విద్యార్హత లేదా ఐదేళ్ల అనుభవం ఉండాలి. నియోజకవర్గ, మండల స్థాయి రిపోర్టర్లకు ఇంటర్మీడియట్ విద్యార్హత తప్పనిసరి. 15 ఏళ్ల అనుభవం ఉన్న ఫ్రీలాన్సర్లు, 30 ఏళ్ల అనుభవంతో పాటు 58 ఏళ్లు నిండిన వెటరన్ జర్నలిస్టులు కూడా కార్డులకు దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంది. బీఆర్ఎస్ హయాంలో అక్రిడిటేషన్ కార్డులు జారీ చేశారు. 2022లో చివరగా కార్డులు ఇచ్చారు. వాటి గడువు 2024 జూన్‌తో ముగిసింది. అయితే కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక కార్డుల గడువును ప్రతి మూడు నెలలకు ఒకసారి పెంచుతూ వస్తోంది. దీంతో కొత్త కార్డుల కోసం జర్నలిస్టులు నిరీక్షిస్తున్నారు. ఈ క్రమంలో తాజాగా ప్రభుత్వం జీవో జారీ చేసింది. అయితే దరఖాస్తులు ఎప్పటి నుంచి తీసుకుంటారనే దానిపై ఇంకా ఎలాంటి ప్రకటన చేయలేదు.

# రేవంత్ రెడ్డి ఓ స్ట్రీట్ రౌడీ



( మొదటిపేజీ తరువాయి )

పెట్టిందే కాంగ్రెస్ పార్టీ అని ఆయన ఆరోపించారు. అప్పుడే కాదు, ఇప్పుడు కూడా పెడుతున్నది ముమ్మాటికీ హస్తం పార్టీయేనని విమర్శించారు. కృష్ణా నీళ్లలో అతి తక్కువ నీటి వినియోగం జరిగింది రేవంత్ రెడ్డి పాలనలోనే అని అన్నారు.

హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో మాజీ మంత్రి హరీశ్ రావు కీలక వ్యాఖ్యలు చేశారు. 'కేసీఆర్ లేవనెత్తిన అంశాలను నివృత్తి చేయాలి లేదంటే సమాధానాలు చెప్పాలి. అది చేయకుండా మరుగుజ్జు మనస్తత్వంతో.. సంకుచిత మనస్తత్వంతో చిట్‌చాట్ పెట్టుకున్నాడు. కేసీఆర్ హిమాలయాల ఎత్తు కలిగిన మనస్తత్వం, రేవంత్ రెడ్డి సంకుచిత మనస్తత్వం. స్టేట్స్‌మెన్‌గా కేసీఆర్ మాట్లాడితే, రేవంత్ స్ట్రీట్ రౌడీగా మాట్లాడాడు. చీప్‌గా మాట్లాడాడు' అని మాజీ మంత్రి హరీశ్ రావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రేవంత్ పాలనలో ఒక్క ఎకరాకు నీరు ఇచ్చింది లేదని, ఒక్క చెక్ డ్యామ్ కట్టింది లేదు, ఒక చెరువు తవ్వింది లేదు అని హరీష్ రావు వ్యాఖ్యానించారు. ఒక్క ప్రాజెక్ట్ కట్టిన పాపానపోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. "మీరు నీళ్ల గురించి మాట్లాడతారా?. కృష్ణా నది నీళ్లను తాకట్టు పెట్టిందే మీరు. 299 టీఎంసీలను పుట్టించిందే కాంగ్రెస్. దగా చేసిందే కాంగ్రెస్. ఇదివరకు ఎప్పుడూ లేనంతగా రేవంత్ పాలనలో కృష్ణా నీరు అతితక్కువ వినియోగం జరిగింది. ఉన్నా ఒప్పందాన్ని కూడా వాడుకోకుండా ఆంధ్రప్రదేశ్ అడుగులకు మడుగులు ఒత్తి, దాసోహం అయ్యారు. తెలంగాణకు, పాలమూరుకు అన్యాయం చేశారు.

ఉత్తమ్ కుమార్ రెడ్డి ఇరిగేషన్ మంత్రి అయి రెండేళ్లు అయినా, ఇంకా ప్రిపేర్ అవ్వలేదని అంటుంటారని, సగం సగం ప్రెస్‌మీట్లు పెట్టి రాష్ట్ర పరువు తీస్తున్నారని హరీష్ రావు వ్యంగ్యాస్త్రాలు సంధించారు. "ఉత్తమ్ కుమార్ రెడ్డి అంటే బాధపడతారేమో గానీ, ప్రిపేర్ కాకుండా ప్రెస్‌మీట్లు ఏంది?. ఎనకటకి కేసీఆర్ అసెంబ్లీలో ప్రజెంటేషన్ పెడితే, ప్రిపేర్ కాలేదని చెప్పి అసెంబ్లీ నుంచి వెళ్లిపోయారు. ఇప్పుడు నీటి పారుదల శాఖ మంత్రి అయ్యి రెండేళ్లు అయ్యింది. ఇప్పుడైనా ప్రిపేర్ అయ్యి రా. ఆ ప్రెస్‌మీట్లు ఏంది?, ప్రిపేర్ కాకుండా ప్రెస్‌మీట్లకు వస్తే నీ పరువు, ప్రభుత్వం పరువు, మొత్తంగా రాష్ట్ర ప్రభుత్వం పరువుపోతుంది'' అని హరీష్ రావు వ్యంగ్యాస్త్రాలు సంధించారు. కాంగ్రెస్ ప్రభుత్వం టార్గెట్‌గా మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఆదివారం నాడు చేసిన వ్యాఖ్యలకు కాంగ్రెస్ మంత్రులు సోమవారం స్ట్రాంగ్ కౌంటర్లు ఇచ్చారు. తోలు తీస్తామంటూ కేసీఆర్ చేసిన హెచ్చరికపై మంత్రి పొన్నం ప్రభాకర్ స్పందిస్తూ, ఆల్రెడీ ప్రజలు తమరి తోలు తీస్తూనే ఉన్నారని వ్యంగ్యాస్త్రాలు సంధించారు. పాలమూరురంగారెడ్డి ప్రాజెక్ట్ డీపీఆర్ తొమ్మిదేళ్ల తర్వాత ఎందుకు వెనక్కి వచ్చిందని ఆయన ప్రశ్నించారు. కేసీఆర్ వస్తే అసెంబ్లీని మరింత హుందాగా నడుపుకుందామంటూ మంత్రి పొన్నం సూచన చేశారు. ఒక రాజకీయ పార్టీగా ఆ బాధ్యత ఉందని ఆయన అన్నారు. "శాసనసభకు హాజరై ప్రజా సమస్యలపై మాట్లాడండి. తెలంగాణ ఉద్యమకారుడిగా కేసీఆర్‌పై మాకు గౌరవం ఉంది'' అని అన్నారు. మరోవైపు, కేంద్ర ప్రభుత్వం తెలంగాణపై వివక్ష చూపుతోందని ఆయన ఆరోపించారు. పక్కరాష్ట్రం ఆంధ్రప్రదేశ్‌కు సహకరిస్తూ రాష్ట్రానికి మొండిచేయి చూపుతోందని అన్నారు. తెలంగాణలో బీజేపీ ఆఫీస్‌కు తాళాలు వేసుకోవాల్సిన పరిస్థితి వస్తుందని ఆయన మండిపడ్డారు. ప్రభుత్వానికి సలహాలు, సూచనలు ఇవ్వాలని చెప్పామని, అంతేగానీ, తోలుతీస్తామంటే తీయించుకునేందుకు ఇక్కడెవరూ సిద్ధంగా లేరని ఆగ్రహం వ్యక్తం చేశారు.

# ఈనెల 29 నుంచి అసెంబ్లీ సమావేశాలు




( మొదటిపేజీ తరువాయి )

చూడాలని మంత్రులను హెచ్చరించారు. ఈ ఎన్నికల విజయానికి సంబంధించి ఆయా జిల్లాల ఇన్‌ఛార్జ్ మంత్రులే పూర్తి బాధ్యత వహించాలని సీఎం స్పష్టం చేశారు. స్థానిక సంస్థల్లో క్లీన్ స్వీప్ చేయడమే లక్ష్యంగా పార్టీ శ్రేణులను సమాయత్తం చేయాలని దిశానిర్దేశం చేశారు.

అయితే తాజాగా కేసీఆర్ చేసిన వ్యాఖ్యలపై స్పందిస్తూ కృష్ణా నదీ జలాల విషయంలో ఎవరేం చేశారో, ఎవరి హయాంలో ఏం జరిగిందో కూలంకశంగా మాట్లాడేందుకు వచ్చే నెల 2 నుంచి అసెంబ్లీ సమావేశాలు పెట్టుకుందామని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి చెప్పారు. ప్రధాన ప్రతిపక్ష నేత కేసీఆర్ కూడా వస్తే అన్ని విషయాలపై చర్చిద్దామని తాను ప్రతిపాదిస్తున్నానన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో ఏం జరిగిందో, కేసీఆర్ అధికారంలో ఉన్నప్పుడు ఏం జరిగిందో తాను ముఖ్యమంత్రి అయ్యాక ఏం చేశానో అన్ని విషయాలను మాట్లాడుకోవచ్చని చెప్పారు. ప్రతిపక్ష నేతగా ఆయన ప్రజలకు ఉపయోగపడే సూచనలు చేస్తే ఆమోదించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. ఉమ్మడి రాష్ట్రంలో కంటే కేసీఆర్ హయాంలోనే కృష్ణా జలాల్లో తెలంగాణకు ఎక్కువ అన్యాయం జరిగిందన్నారు. శాశ్వతంగా కృష్ణా జలాల హక్కులను ఏపీకి రాసిచ్చేసి పాల మూరు, నల్లగొండ, ఖమ్మం జిల్లాల ప్రజలకు మరణశాసనం రాసింది కేసీఆరేనని ఆరోపించారు. 'కలుగులో ఉన్న ఎలుకకు పొగబెడితే బయటకు వచ్చినట్టు రెండేళ్ల తర్వాత కేసీఆర్ బయటకు వచ్చాడు. ప్రజలిచ్చిన తీర్పు కేసీఆర్‌కు కనువిప్పు కలిగించి సత్ప్రవర్తన తెస్తుందని ఆశించాం. కానీ రెట్టించిన ఉత్సాహంతో చెప్పిన అబద్ధం చెప్పకుండా అబద్ధాలే పెట్టుబడిగా ఆయన 75 నిమిషాల ప్రసంగం సాగింది. బీఆర్ఎస్ చేసిన నేరాలు, ఘోరాలు దృష్టిలో పెట్టుకుని 2023 డిసెంబర్‌లో జరిగిన అసెంబ్లీ, ఆ తర్వాత జరిగిన పార్లమెంటు, కంటోన్మెంట్, జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలు, ఇప్పుడు పంచాయతీ ఎన్నికల్లో స్పష్టమైన తీర్పు ఇచ్చారు. కరడుగట్టిన నేరగాళ్లకు కూడా కనువిప్పు కలుగుతుంది కానీ కేసీఆర్ మాత్రం ఏ మాత్రం జంకు లేకుండా రంకు మాటలు మాట్లాడుతున్నాడు అని తీవ్ర స్థాయిలో మండిపడ్డారు.

**మూతి దగ్గర కాకుండా తోక దగ్గర**

ఉమ్మడి రాష్ట్రంలో కంటే కేసీఆర్ సీఎంగా ఉన్నప్పుడే కృష్ణా జలాల్లో తెలంగాణకు ఎక్కువ అన్యాయం జరిగింది. 811 టీఎంసీల్లో 512 ఏపీకి, 299 టీఎంసీలు తెలంగాణకు అని సంతకం పెట్టింది ఎవరు? ఒక్కసారి కాదు పదేపదే సంతకాలు పెట్టి పాలమూరు, నల్లగొండ, ఖమ్మం జిల్లాల ప్రజలకు మరణ శాసనం రాసిందే కేసీఆర్. 2021-22లో శాశ్వతంగా కృష్ణా జలాల హక్కులను కేసీఆర్ ఏపీకి రాసిచ్చారు. పాలమూరు - రంగారెడ్డి ప్రాజెక్టు ద్వారా జూరాల దగ్గర ఒడిసిపట్టుకోవాల్సిన నీటిని శ్రీశైలంలో కలిపి ఏపీ జలదోపిడీకి రాజమార్గం ఏర్పాటు చేశాడు.

# ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక పరిణామం

- తెలంగాణలో సంచలనం రేపిన ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక పరిణామం
- మాజీ ఇంటలిజెన్స్ చీఫ్ నవీన్ చంద్‌తో పాటు సిట్ విచారణ చేసింది
- అభ్యంతరాలు తెలిపేందుకు ఇచ్చిన గడువు ముగిసిందని గుర్తు చేసింది
- ట్యాపింగ్ రివ్యూ కమిటీలోని వారిని సిట్ మరోసారి విచారించింది
- మరోసారి నోటీసులు జారీ చేయటం ఇప్పుడు సంచలనంగా మారుతోంది
- ముగ్గురు మాజీ ఐఏఎస్‌లతోపాటు మాజీ ఐపీఎస్‌లను సాక్షులుగా విచారించింది



**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

సంచలనం రేపిన ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఈ కేసులో సిట్ విచారణ వేగవంతం చేసింది. రివ్యూ కమిటీలో ఉన్న వారిని సిట్ విచారించింది. ప్రభాకర్ రావు ఫోన్ ట్యాపింగ్ చేసిన సమయంలో రివ్యూ కమిటీలో సభ్యులుగా ఉన్న అప్పటి సీఎస్ సోమేశ్ కుమార్ సహా.. మాజీ ఇంటలిజెన్స్ చీఫ్ నవీన్ చంద్‌తో పాటుగా మరి కొందరి అధికారులను సిట్ విచారణ చేసింది. వారి స్టేట్ మెంట్లను రికార్డు చేసింది. తాజాగా మరోసారి నోటీసులు జారీ చేయటం ఇప్పుడు సంచలనంగా మారుతోంది. ఫోన్ ట్యాపింగ్ వేసులో వేగంగా పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. ట్యాపింగ్ రివ్యూ కమిటీలోని వారిని సిట్ మరోసారి విచారించింది. ఈ ట్యాపింగ్ వ్యవహారంలో కీలకంగా వ్యవహరించిన ప్రభాకర్ రావు ఎస్ఐబీ చీఫ్‌గా ఉన్న సమయంలో రివ్యూ కమిటీలో ఉన్న జీఏడీ సెక్రటరీ, సీఎస్‌లు, ఇంటెలిజెన్స్ చీఫ్‌ను సిట్ మరోసారి విచారించింది. వారి ఇచ్చిన స్టేట్‌మెంట్లను సిట్ రికార్డు చేసింది. ముగ్గురు మాజీ ఐఏఎస్‌లతోపాటు మాజీ ఐపీఎస్ అధికారులను సిట్ సాక్షులుగా విచారించింది. మాజీ సీఎస్‌లు సోమేష్ కుమార్, శాంతి కుమారిలను విచారించింది. అలాగే సాధారణ పరిపాలన శాఖ మాజీ పొలిటికల్ సెక్రటరీ రఘునందన్ రావుతోపాటు మాజీ ఇంటెలిజెన్స్ చీఫ్ నవీన్ చంద్‌ను కూడా విచారించింది. ఎస్ఐబీ ఓఎస్‌డీగా ప్రభాకర్ రావును నియమించడంపై ఐఏఎస్‌లకు సిట్ పలు ప్రశ్నలు సంధించింది.

గత ప్రభుత్వంలో ఈ ముగ్గురు ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు కీలకంగా వ్యవహరించారు. కాగా, గత ప్రభుత్వ హయాంలో రాజకీయ నాయకులు, వ్యాపారవేత్తలతోపాటు మీడియా ప్రతినిధుల ఫోన్లను సైతం ప్రభాకర్ రావు ట్యాప్ చేసినట్లు తమ దర్యాప్తులో సిట్ గుర్తించింది. ప్రభాకర్ రావు ఇచ్చిన నెంబర్లను యథావిధిగా హోం శాఖకు ఈ మాజీ ఐపీఎస్ అధికారులు పంపినట్లు దర్యాప్తులో వెల్లడైంది. అనుబంధ చార్జిషీట్ ఫైల్ చేసేందుకు సిట్ ప్రయత్నాలు చేపట్టింది. మరోవైపు ఈ ఫోన్ ట్యాపింగ్ కేసులో చార్జ్‌షీట్ దాఖలు చేయాలని ఇప్పటికే ఉన్నతాధికారులను సిట్ చీఫ్, హైదరాబాద్ సీపీ వీసీ సజ్జనార్ ఆదేశించారు. అయితే.. మరోవైపు ఈ కేసులో మూడో రోజు ప్రభాకర్ రావు కస్టడీ విచారణ కొనసాగుతోంది. ఆయన్ని విచారించేందుకు సిట్‌లో సభ్యుడు అయిన సిద్దిపేట సీపీ విజయ్ కుమార్ ఇప్పటికే జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌కు చేరుకున్నారు. ఈ ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో ప్రభాకర్ రావును సిద్ధిపేట సీపీ విచారించనున్నారు. జూన్ 2024లో తెలంగాణలో సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసు దర్యాప్తులో రాష్ట్ర ప్రభుత్వం అత్యంత కీలకమైన నిర్ణయం తీసుకుంది. ఇప్పటివరకు సాధారణ పోలీస్ విచారణగా సాగుతున్న ఈ కేసును మరింత లోతుగా, పారదర్శకంగా విచారించేందుకు సీనియర్ ఐపీఎస్ అధికారి వీసీ సజ్జనార్ నేతృత్వంలో ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ కేసును హైదరాబాద్ పోలీసులు దర్యాప్తు జరుపుతున్నారు. అయితే, దర్యాప్తులో వేగం తగ్గడం, కీలక సూత్రధారులను పట్టుకోవడంలో జాప్యం జరగడంపై ప్రభుత్వం అసంతృప్తిగా ఉన్నట్లు తెలుస్తోంది. ఈ కేసులో కేవలం కొంతమంది అధికారుల అరెస్టుతోనే ప్రక్రియ ఆగిపోయిందని, అసలైన రాజకీయ కోణాన్ని వెలికితీయడంలో ఇప్పటివరకు జరిగిన విచారణ సరిపోలేదని భావించిన సర్కార్, ఈ బాధ్యతను సజ్జనార్‌కు అప్పగించింది.

తాజాగా నియమితులైన సిట్ ఫోన్ ట్యాపింగ్ ఆదేశాలు ఎక్కడి నుంచి వచ్చాయి? దీని వెనుక ఉన్న రాజకీయ పెద్దలెవరు? అనే కోణంలో సిట్ విచారణ జరుపుతుందని భావిస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా ప్రైవేట్ వ్యక్తుల సహాయంతో ఇజ్రాయెల్ వంటి దేశాల నుంచి దిగుమతి చేసుకున్న పరికరాలను ఎలా వాడారు? అనేది నిగ్గు తేల్చనుంది. ఎస్ఐబీ కార్యాలయంలో సాక్ష్యాలను మాయం చేసేందుకు ధ్వంసం చేసిన కంప్యూటర్లు, హార్డ్ డిస్క్‌ల నుంచి డేటాను రీట్రీవ్ చేయడంపై దృష్టి పెట్టనుంది. హవాలా మార్గాల్లో నగదు రవాణాకు మరియు ఎన్నికల సమయంలో ప్రతిపక్షాల ఫోన్లను ట్రాక్ చేయడానికి ఈ వ్యవస్థను ఎలా ఉపయోగించుకున్నారో సిట్ ఆధారాలు సేకరిస్తుంది. వివాదాస్పద, క్లిష్టమైన కేసులను ఛేదించడంలో సీనియర్ అధికారి వీసీ సజ్జనార్‌కు ప్రత్యేక గుర్తింపు ఉంది. టెక్నాలజీపై అవగాహన ఉండటంతో పాటు, కఠినమైన అధికారిగా ఆయనకున్న ఇమేజ్ ఈ కేసులో బాధితులకు నమ్మకాన్ని కలిగిస్తుందని ప్రభుత్వం భావిస్తోంది. ఆయనకు సహకరించేందుకు మరికొందరు దక్షత కలిగిన అధికారులను కూడా ఈ బృందంలో చేర్చారు. నిందితులను అరెస్టు చేసి చాలా రోజులు జైల్లో పెట్టారు. ప్రభాకర్ రావును అమెరికా నుంచి రప్పించి ప్రశ్నించారు. అయితే ఈ కేసులో ఆధారాలేమీ లభించడండ లేదని తెలుస్తోంది. అందుకే సజ్జనార్ రంగంలోకి దింపారని భావిస్తున్నారు. సిట్ రంగంలోకి దిగిన తర్వాత ఈ కేసులో కీలకమైన మార్పులు చోటు చేసుకునే అవకాశం ఉంది. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు విచ్చలవిడిగా ఫోన్ ట్యాపింగ్ చేశారని అప్పటి విపక్ష నేతలు రేవంత్ రెడ్డి, బండి సంజయ్ సహా చాలా మంది ఆరోపణలు చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక.. ఇంటలిజెన్స్ విభాగంలో అత్యంత సున్నితమైన డేటా కనిపించకుండా పోవడంతో విచారణ చేపట్టారు. దీంతో ఫోన్ ట్యాపింగ్ కేసు వెలుగులోకి వచ్చింది. కానీ ఆధారాలు సేకరించడంలో పోలీసులు సక్సెస్ లేకపోవడంతో సిట్ కు కేసును అప్పగించాలని చాలా ఆలస్యంగా నిర్ణయం తీసుకున్నట్లుగా తెలుస్తోంది.

# డీలిమిటేషన్‌కు మార్గం సుగమం



**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్లను 300 డివిజన్లను పెంచడంపై దాఖలైన 80 పిటిషన్లను తెలంగాణ హైకోర్టు కొట్టి వేసింది. ప్రస్తుత పరిస్థితుల్లో జోక్యం చేసుకోలేమని తెలిపింది. అభ్యంతరాలు తెలిపేందుకు ఇచ్చిన గడువు ముగిసిందని హైకోర్టు గుర్తు చేసింది. దీంతో ప్రభుత్వం గ్రేటర్ ను 300 వార్డులుగా విభజించడానికి అడ్డంకులు తొలగిపోయినట్లయింది. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిని విస్తరిస్తూ, వార్డుల సంఖ్యను 150 నుండి 300కు పెంచుతూ ప్రభుత్వం డీలిమిటేషన్ ఉత్తర్వులు జారీ చేసింది. జీహెచ్ఎంసీ వార్డుల పునర్విభజన అశాస్త్రీయంగా ఉందంటూ పలువురు కోర్టును ఆశ్రయించారు. పిటిషన్లపై విచారణ చేపట్టిన సింగిల్ జడ్జి జస్టిస్ విజయ్‌సేన్ రెడ్డి, తొలుత 300 వార్డుల జనాభా వివరాలు, మ్యాప్‌లను 24 గంటల్లో పబ్లిక్ డొమైన్‌లో ఉంచాలని ఆదేశించారు. అయితే, దీనిపై ప్రభుత్వం అప్పీలుకు వెళ్లడంతో డివిజన్ బెంచ్ ఈ ఉత్తర్వులను పాక్షికంగా సవరించింది. కేవలం పిటిషనర్లు అభ్యంతరం వ్యక్తం చేసిన వార్డులు ముఖ్యంగా వార్డు నెం. 104 షా అలీ బండా, 134 లంగర్ హౌజ్ వివరాలు మాత్రమే బహిర్గతం చేయాలని స్పష్టం చేసింది.

వార్డుల విభజనపై ప్రజలు తమ అభ్యంతరాలను సమర్పించడానికి హైకోర్టు అదనపు సమయం కేటాయించింది. తొలుత డిసెంబర్ 17తో ముగియాల్సిన గడువును కోర్టు డిసెంబర్ 19 వరకు పొడిగించింది. ప్రభుత్వం తరఫున అడ్వొకేట్ జనరల్ డీలిమిటేషన్ అనేది ప్రభుత్వ విధానపరమైన నిర్ణయమని, ఇందులో కోర్టుల జోక్యం పరిమితంగా ఉండాలని వాదించారు. కేంద్ర సెన్సస్ కమిషనర్ ఆదేశాల ప్రకారం డిసెంబర్ 31, 2025 నాటికి ఈ ప్రక్రియ పూర్తి కావాల్సి ఉందని, అందుకే వేగంగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఇప్పటికే నోటిఫికేషన్లు జారీ చేశామని, అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకుంటామని హామీ ఇచ్చారు. డీలిమిటేషన్ పై ప్రభుత్వానికి చాలా అభ్యంతరాలు వచ్చాయి. ఒకే వార్డు రెండు, మూడు అసెంబ్లీ నియోజకవర్గాల్లోకి వస్తోందని కొందరు ఫిర్యాదు చేశారు. కొన్ని వార్డుల్లో 18 వేల జనాభా ఉంటే, మరికొన్నింటిలో 70 వేల వరకు ఉండటంపై కార్పొరేటర్లు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. హయత్ నగర్ వంటి ప్రాంతాల్లో చారిత్రక కట్టడాలు ఒక వార్డులో, ఆ ప్రాంత పేరుతో ఉన్న మరో వార్డు వేరే చోట ఉండటంపై స్థానికులు వ్యతిరేకత వ్యక్తం చేస్తున్నారు. హైకోర్టు ఆదేశాల మేరకు జీహెచ్ఎంసీ అధికారులు అభ్యంతరాలను స్వీకరిస్తూనే, మరోవైపు కోర్టు కోరిన వార్డుల మ్యాప్‌లను వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచారు. డిసెంబర్ 31లోగా తుది నివేదిక సిద్ధం చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోంది. దానికి సంబంధించి కోర్టు వద్ద అడ్డంకులు అన్నీ తొలగిపోయినట్లయింది.

జీహెచ్ఎంసీలో శివారు మున్సిపాలిటీలను విలీనం చేసిన సంగతి తెలిసిందే. దీంతో వార్డులు, జోన్ల విభజన ప్రక్రియను అధికారులు వేగవంతం చేశారు. అయితే వార్డుల డీలిమిటేషన్ మీద పలువురు తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారు. అలానే ఈ అంశంపై కొందరు హైకోర్టును ఆశ్రయించారు. ఇదిలా ఉంటే కూకట్‌పల్లి డివిజన్‌ను విభజించవద్దని కోరుతూ స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. డీలిమిటేషన్ ప్రక్రియలో భాగంగా కూకట్‌పల్లి నియోజకవర్గంలోని కేపీహెచ్‌బీ డివిజన్‌ను విభజించవద్దంటూ ఆ కాలనీ వాసులు ఆందోళనకు దిగారు. ఈ కాలనీని మూడు భాగాలుగా చేయాలని అధికారులు నిర్ణయించారు. అయితే దీనిపై పెద్ద ఎత్తున ఆగ్రహం వ్యక్తమవుతోంది. కేపీహెచ్‌బీని మూడు ముక్కలు చేయవద్దని కోరుతూ కాలనీవాసులు.. రాజకీయ పార్టీల నాయకులతో కలిసి రోడ్డు నంబర్ 1లో ఉన్న గాంధీ విగ్రహం వద్ద శాంతియుత నిరసన చేపట్టారు. కేపీహెచ్‌బీ డివిజన్‌గా గుర్తింపు పొందింది. ఆసియాలోనే అతిపెద్ద డివిజన్‌గా ప్రఖ్యాతి గాంచింది. ఈ డివిజన్‌కు 46 ఏళ్ల చరిత్ర ఉంది. అంతటి ప్రఖ్యాతి పొందిన ఈ డివిజన్‌ను మూడు ముక్కలుగా చేయడం మంచిది కాదని.. ఈ నిర్ణయాన్ని విరమించుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. కేపీహెచ్‌బీ రోడ్డు నంబర్ 1 నుంచి జేఎన్టీయూ వరకు, జేఎన్టీయూ నుండి ఫోర్త్ ఫేజ్ వరకు కేపీహెచ్‌బీ డివిజన్‌గా మార్చాలని కోరారు.

జేఎన్టీయూ నుంచి కలవరి టెంపుల్ వరకు కేపీహెచ్‌బీ డివిజన్ 2 గా మార్చాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. డివిజన్ల పునర్విభజనలో బాలాజీ నగర్, వసంత నగర్ డివిజన్లను.. తమ డివిజన్‌లలో కలపవద్దని ప్రజలు కోరారు. సమస్యలు వస్తే ఏ కార్పొరేటర్ దగ్గరికి వెళ్లాలో తెలియని పరిస్థితి నెలకొందన్నారు. ఇప్పటికైనా జీహెచ్ఎంసీ అధికారులు తమ సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేస్తున్నారు. లేదంటే తాము పెద్ద ఎత్తున ఉద్యమం చేస్తామని కాలనీ వాసులు హెచ్చరించారు.

# కేసీఆర్ తోలు మాటలు ఆపు

- కేసీఆర్‌పై కాంగ్రెస్ మంత్రులు ఎదురుదాడికి దిగారు
- మంత్రి జూపల్లి, పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి మాట్లాడారు
- బీఆర్ఎస్ కండలన్నీ కరిగి తోలు మాత్రమే మిగిలిందన్నారు
- కేసీఆర్ తోలు తీస్తానని మాట్లాడుతున్నాడని ఎద్దేవా చేశారు
- బీఆర్ఎస్ ప్రతిష్ట దిగజారిందని కేసీఆర్‌కు అర్థమైందని అన్నారు
- పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టను ఎందుకు పూర్తి చేయలేదని నిలదీశారు




**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ తాజాగా కాంగ్రెస్ ప్రభుత్వంపైన చేసిన విమర్శలకు సోమవారం మంత్రులు వరుసబెట్టి ఎదురుదాడి చేశారు. మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ.. సీఎం రేవంత్ రెడ్డి రెండేళ్ల పాలనలో బీఆర్ఎస్ కండలన్నీ కరిగి తోలు మాత్రమే మిగిలిందని, ఆ ఉన్న తోలును కాపాడుకోవడానికే బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ తోలు తీస్తానని మాట్లాడుతున్నాడని ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ ప్రతిష్ట దిగజారిందని కేసీఆర్‌కు అర్థమై పార్టీని కాపాడుకోవడానికే ఇన్ని రోజుల తర్వాత బయటికి వచ్చాడన్నారు. కుర్చీ వేసుకుని పూర్తి చేస్తానన్న పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టను కేసీఆర్ పదేళ్ల పాలనలో ఎందుకు పూర్తి చేయలేదని, ఒక్క ఎకరానికి కూడా నీళ్లివ్వలేకపోయాడని నిలదీశారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలు కాంగ్రెస్ పాలనకు రెఫరెండమ్ అని కేటీఆర్ వ్యాఖ్యానించిన సంగతి గుర్తులేదా అని ప్రశ్నించారు. కేసీఆర్ తోలు తీస్తామంటే తీయించుకోవడానికి సిద్ధంగా లేము అని మంత్రి పొన్నం ప్రభాకర్ కౌంటర్ ఇచ్చారు. ప్రజాస్వామ్యంలో తోలు తీసే హక్కు ప్రజలకు మాత్రమే ఉందన్నారు. అసెంబ్లీ, ఎంపీ, ఎమ్మెల్సీ, ఉప ఎన్నికలు, పంచాయతీ ఎన్నికలలో ఇప్పటికే ప్రజలు బీఆర్ఎస్ తోలు తీశారన్నారు. ఎవరు ఏది పడితే అది మాట్లాడితే చూస్తూ ఊరుకోబోమని, బరాబర్ సమాధానం చెబుతామన్నారు. తోలు తీయాలనుకున్నా...ఇంకా ఏదైనా ఉన్నా.. సీఎం రేవంత్ రెడ్డి చెప్పినట్లుగా అసెంబ్లీకి వచ్చి కేసీఆర్ మాట్లాడాలన్నారు. కేసీఆర్ పాలన వైఫల్యాల గూర్చి ఆయన కూతురు కవితనే నిత్యం చెబుతుందని..ముందు వాటిపై సమాధానం చెప్పాలని హితవు పలికారు.

**కవితమ్మ తీస్తున్న తోలుకు పాచెస్ వేసుకోండి : మంత్రి వాకిటి శ్రీహరి**

కేసీఆర్ మా తోలు తీయడం కాదు అని..ముందుగా కవితమ్మ తీస్తున్న తోలుకి ముందు పాచెస్ వేసుకోండని మంత్రి వాకిటి శ్రీహరి చురకలేశారు. పార్లమెంట్ ఎన్నికలప్పుడు కూడా సేమ్ ఇవే డైలాగులు కొట్టిండని.. పాలమూరు మీద కేసీఆర్ కపట ప్రేమ చూపిస్తున్నారని, అధికారంలో పదేళ్లు మాత్రం ఒక్క ప్రాజెక్టు కట్టలేదని, ఒక్క ఎకరాకు నీరివ్వలేదని విమర్శించారు. అసలు పాలమూరురంగారెడ్డి ప్రాజెక్టుని కట్టకుండానే, అనుమతులు లేకుండానే, పంప్ హౌజ్‌లు, కాలువలు నిర్మించకుండానే జాతికి అంకితం చేశాం అని కేసీఆర్ ఎలా చెప్పగలుగుతున్నారు? అని ప్రాజెక్టు కట్టకుండానే అలాంటి మాటలు మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. అందుకే కదా మొన్న ఎన్నికల్లో కేసీఆర్ కు కర్రు కాల్చి వాత పెట్టారు అని వాకిటి శ్రీహరి విమర్శించారు.

**కేసీఆర్‌వి పస లేని మాటలు: ఆది శ్రీనివాస్**

ప్రతిపక్ష నేతగా బాధ్యత విస్మరించి ఇన్నాళ్లు ఫామ్ హౌస్ లో పడుకుని..బయటకొచ్చిన కేసీఆర్ పదేళ్లు రాష్ట్రాన్ని విధ్వంసం చేసినందుకు ప్రజలకు క్షమాపణ చెబుతారని అనుకున్నామని, రెండేళ్ల తర్వాత నిద్ర లేచి జనం బాట పడతాననడం హాస్యాస్పదంగా ఉందని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ విమర్శించారు. అసెంబ్లీకి రావడానికే భయపడుతూ కేసీఆర్ రాష్ట్ర రాజకీయాల్లో అవుట్ డేటెడ్ అయ్యారన్నారు. తోలు తీస్తానని కేసీఆర్ చెప్పిన మాటలు హాస్యాస్పదంగా ఉన్నాయని, అసెంబ్లీ, ఎంపీ, ఎమ్మెల్సీ, ఉప ఎన్నికలు, పంచాయతీ ఎన్నికల్లో ప్రజలే ఆయన తోలు తీస్తే ఎండిపోయిందన్నారు. ప్రాజెక్టులపైన కేసీఆర్ చెప్పినవన్ని అబద్ధాలేనని, ఆయన మాట్లాడిన ప్రతి మాటకు మా వద్ద సమాధానం ఉందన్నారు. తెలంగాణకు నది జలాల్లో నష్టం చేసిన కేసీఆర్..ఇప్పుడు మొసలి కన్నీరు కార్చడం విడ్డూరంగా ఉందని విమర్శించారు. కేసీఆర్ పాలనలో 8లక్షల కోట్ల అప్పుల పాలు చేసి రాష్ట్రాన్ని విధ్వంసం చేస్తే..సీఎం రేవంత్ రెడ్డి వాటన్నింటిని సరిచేసుకుంటూ చక్కని పరిపాలన చేస్తున్నారు. భావి తరాల కోసం ఫ్యూచర్ సిటీ చేపడితే..రాష్ట్ర అభివృద్ధి కోసం గ్లోబల్ సమ్మిట్ నిర్వహిస్తే వాటిని తప్పుబట్టిన కేసీఆర్ తీరు ఖండనీయమన్నారు. మీ పాలనలో జరిగిన అవినీతి, అక్రమాలు ఏమిటో మీ కూతురు కవిత నే చెబుతుందన్నారు. ఆమె మాట్లాడిన మాటలకు ముందు కేసీఆర్ సమాధానం చెప్పాలని శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలోని కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్.. ఘాటు విమర్శలు సంధించారు. తనదైన శైలిలో చురకలు అంటించారు. కాంగ్రెస్ పాలనను ఎండగట్టారు. తెలంగాణ తిరోగమిస్తోందంటూ మండిపడ్డారు. ప్రభుత్వం అనుసరిస్తోన్న విధానాల వల్ల మళ్లీ ఫ్యూడల్ భావాలు తలెత్తుతున్నాయని ఆరోపించారు. రేవంత్ రెడ్డి ప్రతిష్ఠాత్మకంగా భావిస్తోన్న ఫ్యూచర్ సిటీపైనా నిప్పులు చెరిగారు. తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ విస్తృతస్థాయి సమావేశానికి ఆయన అధ్యక్షత వహించారు. దాదాపు మూడు గంటలపాటు ఈ సమావేశం కొనసాగింది. అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడారు కేసీఆర్. దాదాపుగా ఎనిమిది నెలల తర్వాత మీడియా ముందుకు రావడం ఇదే తొలిసారి.

## కేసీఆర్ సెంటిమెంట్ అస్త్రం..
## రేవంత్ అసెంబ్లీ అస్త్రం..


( మొదటిపేజీ తరువాయి )



జనవరి రెండో తేదీ నుంచి అసెంబ్లీ సమావేశాలు ఏర్పాటు చేస్తాం.. మొత్తం చర్చించేందుకు రావాలని సవాల్ చేశారు. సాధారణంగా అయితే ఇలాంటి అంశాలపై ఆరోపణలు చేసినప్పుడు అసెంబ్లీని ఏర్పాటు చేసి సమగ్రంగా చర్చించాలని ప్రజల ముందు నిజాలు పెట్టాలని విపక్ష నేతలు డిమాండ్ చేస్తూ ఉంటారు. కానీ కేసీఆర్ అసెంబ్లీ మాట ఎత్తలేదు. బహిరంగ సభలు పెడతామని మాత్రం ప్రకటించారు. కానీ రేవంత్ ముఖాముఖి తేల్చుకుందాం రమ్మని సవాల్ చేస్తున్నారు. కేసీఆర్ ఆరోపణల్లో నిజం ఉంటే.. రేవంత్ సవాల్ కంటే... మంచి అవకాశం దొరకదు. కానీ ఉపయోగించుకుంటారా.. పారిపోతారా అన్నది మాత్రం సస్పెన్స్ గా నే ఉంది. కృష్ణాజలాలతో రాజకీయాలు చేయాలని కేసీఆర్ అనుకుంటున్నారు. రాజకీయం అంటే తప్పుగా అనుకోవాల్సిన అవసరం లేదు. తెలంగాణకు న్యాయంగా దక్కాల్సిన నీటి వాటా దక్కకపోతే ఆ అంశంపై తప్పనిసరిగా చర్చ జరగాల్సిందే. ఆ అన్యాయం ఎవరి వల్ల జరిగిందో కూడా బయటకు రావాల్సిందే. రాజకీయ నేతలు తప్పిదాలు చేస్తే దానికి తెలంగాణ మూల్యం చెల్లించకూడదు. తెలంగాణ పేరుతో సెంటిమెంట్ రాజకీయాలు చేసి..తెలంగాణకు అన్యాయం చేశాడని.. అసలు తెలంగాణకు నీటి వివాదాలు రావడానికే కేసీఆర్ కారణం అని రేవంత్ ఆరోపిస్తున్నారు. ఎవరి ఆరోపణల్లో నిజం ఉందో ఎవరికి వారు ప్రెస్మీట్లు పెట్టి చెప్పుకుంటే ఎవరి వాదనవారు చెప్పుకుంటారు. కానీ అసెంబ్లీలో అయితే ముఖాముఖిగా ఆధారాలతో సహా చర్చించడానికి అవకాశం ఉంటుంది. తెలంగాణకు అన్యాయం జరిగిపోయిందని తాము ఇక ఊరుకోలేమని కేసీఆర్ అంటున్నారు. ఆ అన్యాయం ఏమిటో.. అది ఇప్పుడే జరుగుతోందా.. ఎప్పటి నుంచో జరుగుతోందా అన్నది మాత్రం చెప్పడంలేదు. కానీ రేవంత్ ప్రభుత్వం ఏదో అన్యాయం చేస్తోందన్న అభిప్రాయం కల్పించడానికి ప్రయత్నించారు. అంటే .. గుడ్డ కాల్చి ముఖం మీద వేశారు. ఇపుడు తుడుచుకోండి అన్నట్లుగా మాట్లాడుతున్నారు. కానీ రేవంత్.. ఇలా తన ముఖంపై గుడ్డ కాల్చి వేస్తే తుడుచుకునేందుకు ఆసక్తి చూపరు. అది తీసి వేసిన వాళ్ల ముఖం మీదనే వేసేందుకు ప్రయత్నిస్తారు. అది కూడా తప్పించుకోలేని విధంగా. ఇప్పుడు కేసీఆర్ అసెంబ్లీకి రావాల్సిన తప్పని సరి పరిస్థితి ఏర్పడుతోంది. రేవంత్ రెడ్డి ఓ చెరువు గట్టు మీదకో... రచ్చబండ దగ్గరకో చర్చకు రమ్మని సవాల్ చేయలేదు. అసెంబ్లీకే రమ్మన్నారు. అసెంబ్లీకి రావడం అనేది ప్రతిపక్ష నేత విధి. ఆయన రావడం లేదు. ఆయన రావాలని కేసీఆర్ కోరుతున్నారు. బీఆర్ఎస్ కు కావాల్సినంత బలం ఉంది. ఈ విషయం ఆలోచించాల్సింది..కేసీఆర్.. కేటీఆరే !.కేసీఆర్ వచ్చినా రాకపోయినా.. కృష్ణా జలాల విషయంలో కేసీఆర్ చేసిన తప్పుల్ని అసెంబ్లీలో బయటపెట్టడం ఖాయం. డిఫెండ్ చేసుకోవడానికైనా కేసీఆర్ అసెంబ్లీకి వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది.

# స్వేచ్ఛా బంధం

- భారత్-న్యూజిలాండ్ మధ్య స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం
- న్యూజిలాండ్ ప్రధానమంత్రి క్రిస్టోఫర్ లక్సన్‌తో మోదీ సంభాషణ
- ఇరుదేశాల నాయకులు స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాన్ని ప్రకటించారు
- మార్చిలో న్యూజిలాండ్ ప్రధాని లక్సన్ భారత పర్యటనకు వచ్చారు
- ఆ సమయంలో దేశాల మధ్య చర్చలు ప్రారంభమయ్యాయి
- రాబోయే 15 ఏళ్లలో 20 మిలియన్ డాలర్ల పెట్టుబడులు పెట్టనుంది



**విశాలభారతి, నేషనల్:**

భారత్‌న్యూజిలాండ్ మధ్య స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం కుదిరింది. భారత ప్రధాని నరేంద్ర మోదీ సోమవారం న్యూజిలాండ్ ప్రధానమంత్రి క్రిస్టోఫర్ లక్సన్‌తో టెలిఫోన్ సంభాషణ జరిపారు. ఈ క్రమంలో ఇరుదేశాల నాయకులు సంయుక్తంగా భారత్ న్యూజిలాండ్ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాన్ని ప్రకటించారు. స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం రెండు దేశాల మధ్య ఎక్కువ వాణిజ్యం, పెట్టుబడులు, ఆవిష్కరణ, భాగస్వామ్య అవకాశాలకు ఉత్ప్రేరకంగా పనిచేస్తుందని ఇరుదేశాధినేతలు అభిప్రాయపడ్డారు. 2025 మార్చిలో న్యూజిలాండ్ ప్రధాని లక్సన్ భారత పర్యటనకు వచ్చారు. ఆ సమయంలో భారత్‌న్యూజిలాండ్ మధ్య వాణిజ్య చర్చలు ప్రారంభమయ్యాయి. అయితే 9 నెలల రికార్డు సమయంలోనే భారత్ న్యూజిలాండ్ మధ్య కుదిరింది. ఇది ఇరు దేశాల రాజకీయ సంకల్పాన్ని, వ్యూహాత్మక అవగాహనను ప్రతిబింబిస్తుందని కివీస్, భారత్ ప్రధానులు లక్సన్, నరేంద్ర మోదీ అభిప్రాయపడ్డారు. ఈ ట్రేడ్ డీల్ భారత్ న్యూజిలాండ్ మధ్య ద్వైపాక్షిక ఆర్థిక సంబంధాలను గణనీయంగా పెంచుతుంది. ఇరుదేశాల మధ్య వాణిజ్యం, పెట్టుబడులు, సరికొత్త ఆవిష్కరణలు, సప్లై చైన్ సిస్టమ్ సహకారానికి కొత్త ఊపునివ్వనుంది. రెండు దేశాల మధ్య వ్యూహాత్మక సహకారాన్ని బలోపేతం చేస్తుంది. వివిధ రంగాలలో రెండు దేశాల ఆవిష్కర్తలు, వ్యవస్థాపకులు, రైతులు, ఎంఎస్ఎంఈలు, విద్యార్థులు, యువతకు కొత్త అవకాశాలను కల్పిస్తుంది. ఇరుదేశాల మధ్య కుదిరిన స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం అమల్లోకి వచ్చిన తర్వాత రాబోయే ఐదేళ్లలో ప్రస్తుత ద్వైపాక్షిక వాణిజ్యాన్ని రెట్టింపు చేయాలని ఇరు దేశాల నాయకులు నిర్ణయించారు. అలాగే న్యూజిలాండ్ రాబోయే 15 ఏళ్లలో భారత్ లో 20 మిలియన్ డాలర్ల మేర పెట్టుబడులు పెట్టనున్నట్లు వెల్లడించారు. క్రీడలు, విద్య, ప్రజా సంబంధాలు వంటి ద్వైపాక్షిక సహకార రంగాలలో సాధించిన పురోగతిని కూడా నాయకులు స్వాగతించారు.

భారత్‌తో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం కుదిరిన నేపథ్యంలో న్యూజిలాండ్ ప్రధాని క్రిస్టోఫర్ లక్సన్ కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రపంచంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థల్లో భారత్ ఒకటని కొనియాడారు. స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం కుదిరిన సందర్భంగా భారత ప్రధాని నరేంద్ర మోదీతో ఫోన్‌లో మాట్లాడినట్లు వెల్లడించారు. "న్యూజిలాండ్‌భారత్ మధ్య స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం కుదిరిన తర్వాత నేను భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీతో ఫోన్ కాల్ మాట్లాడాను. ఈ డీల్ ద్వారా భారత్ కు న్యూజిలాండ్ నుంచి ఎగుమతయ్యే 95 శాతం ఉత్పత్తులపై సుంకాలను ఇండియా తగ్గిస్తుంది లేదా తొలగిస్తుంది. రాబోయే రెండు దశాబ్దాలలో భారత్ కు న్యూజిలాండ్ ఎగుమతులు సంవత్సరానికి 1.1 బిలియన్ డాలర్లు నుంచి 1.3 బిలియన్ డాలర్లు వరకు పెరుగుతాయి. ఇరుదేశాల మధ్య వాణిజ్యం పెరగడం వల్ల న్యూజిలాండ్ పౌరులకు మరిన్ని ఉద్యోగ అవకాశాలు, మెరుగైన వేతనాలు లభిస్తాయి" అని న్యూజిలాండ్ ప్రధాని క్రిస్టోఫర్ లక్సన్ ఆశాభావం వ్యక్తం చేశారు.

ఈ ట్రేడ్ డీల్ రెండు దేశాల మధ్య బలమైన స్నేహాన్ని తెలియజేస్తుందని లక్సన్ అభిప్రాయపడ్డారు. ప్రపంచంలోనే అత్యంత వేగంగా వృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థల్లో ఒకటిగా ఉన్న భారత్‌లోని 140 కోట్ల మంది వినియోగదారులకు న్యూజిలాండ్ వ్యాపార సంస్థలు చేరువయ్యేందుకు ఈ ఒప్పందం గొప్ప అవకాశమని ఆశాభావం వ్యక్తం చేశారు. భవిష్యత్ కోసం తమ ప్రభుత్వం అవిశ్రాంతంగా కృషి చేస్తోందన్నారు. ఇలాంటి కొత్త వాణిజ్య ఒప్పందాలు దేశ ఆర్థిక వ్యవస్థను అభివృద్ధి చేయడానికి సహాయపడతాయని తెలిపారు. తద్వారా న్యూజిలాండ్ పౌరులు ప్రగతి పథంలో సాగవచ్చని వెల్లడించారు.

అలాగే భారతీయ విద్యార్థులకు న్యూజిలాండ్ గుడ్ న్యూస్ చెప్పింది. సైన్స్, టెక్నాలజీ, ఇంజనీరింగ్ అండ్ మ్యాథమెటిక్స్ బ్యాచిలర్ గ్రాడ్యుయేట్లకు, మాస్టర్స్ గ్రాడ్యుయేట్లకు మూడేళ్ల వరకు, డాక్టరేట్ హోల్డర్లకు నాలుగు సంవత్సరాల వరకు పోస్ట్ స్టడీ వర్క్ వీసాలు లభించనున్నాయి. అదనంగా, కొత్త తాత్కాలిక ఉపాధి ప్రవేశ వీసా వచ్చింది. ఇది నైపుణ్యం కలిగిన వృత్తులలో ఉన్న 5,000 మంది భారతీయ నిపుణులు ఎప్పుడైనా మూడేళ్ల వరకు న్యూజిలాండ్‌లో ఉండడానికి వీలు కల్పిస్తుంది. వీటిలో ఆయుష్ ప్రాక్టీషనర్లు, యోగా బోధకులు, భారతీయ చెఫ్ లు, మ్యూజిక్ టీచర్స్ వంటి భారతీయ ఐకానిక్ వృత్తులు, అలాగే ఐటీ, ఇంజనీరింగ్, ఆరోగ్య సంరక్షణ, విద్య, నిర్మాణం వంటి రంగాలు ఉన్నాయి. ఇటీవల కాలంలో పలు దేశాలతో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలను చేసుకుంటూ దూసుకెళ్తోంది. కొద్ది రోజుల క్రితం ఒమన్ కు పర్యటనకు వెళ్లిన ప్రధాని మోదీ, ఆ దేశంతో ట్రేడ్ డీల్ ను కుదుర్చుకున్నారు. అంతకు ముందు యూకే, యూఏఈ, ఆస్ట్రేలియా, మారిషస్ వంటి దేశాలతోనూ ఒప్పందాలు కుదిరాయి. ఈ క్రమంలో భారత్ వేగంగా విశ్వసనీయమైన ప్రపంచ వాణిజ్య కేంద్రంగా మారుతోంది.

## గ్రామం నుంచి ప్రపంచ స్థాయికి ఎదిగిన
## భారత స్విమ్మర్ క్విని విక్టోరియా



- క్రిస్మస్ సందర్భంగా భారత స్విమ్మర్ డాక్టర్ గంధం క్విని విక్టోరియాకు క్రిస్మస్ సీఎం అవార్డు ప్రదానం
- రాష్ట్ర ప్రభుత్వం, దాతలు సహకరిస్తే మరిన్నే రికార్డులు సాధిస్తా : క్విని విక్టోరియా

**విశాలభారతి హైదరాబాద్:**

మారుమూల గ్రామం నుంచి ప్రపంచ స్థాయికి ఎదిగిన భారత స్విమ్మర్ గంధం క్విని విక్టోరియాకి క్రిస్మస్ సీఎం అవార్డు వరించింది. ప్రపంచ ఓపెన్ వాటర్ లో భారత్ తరపున తల్లి, కుమారుడు సంయుక్తంగా ఈది చరిత్ర సృష్టించిన హైదరాబాద్ బర్కత్ పురకు చెందిన అంతర్జాతీయ ఓపెన్ వాటర్ స్విమ్మర్ డాక్టర్ గంధం క్విని విక్టోరియాకు క్రిస్మస్ పండగ సందర్భంగా స్పోర్ట్స్ విభాగంలో క్రిస్మస్ సీఎం అవార్డు లభించింది. ఇటీవల ఎల్ బి స్టేడియంలో జరిగిన క్రిస్మస్ వేడుకల్లో సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ఈ అవార్డును అందుకున్నారు. ఈ సందర్భం గా సోమవారం బర్కత్ పురలో విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ సీఎం చేతుల మీదుగా ఈ అవార్డు అందుకోవడం ఎంతో స్ఫూర్తినిచ్చిందన్నారు. క్రిస్టియన్ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా లక్ష రూపాయల చెక్కును కూడా అందుకున్నానని తెలిపారు. ఓపెన్ వాటర్ స్విమ్మింగ్ లో అనేక రికార్డులు సాధించి బంగారు పతకాలు సాధించానన్నారు. సప్తసముద్రాలను తదడమే తమ లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. తన కుమారుడి తో కలిసి ఓపెన్ వాటర్ స్విమ్మింగ్ లో రికార్డు నెలకొల్పానన్నారు. రాష్ట్ర ప్రభుత్వం, దాతలు సహకరిస్తే మరిన్నే రికార్డులు సాధిస్తానని పేర్కొన్నారు.

## మహిళల భద్రత మా ప్రథమ ప్రాధాన్యత

- వికారాబాద్ జిల్లా ఎస్పీ జిల్లా స్నేహ మెహ్రా,
- మహిళా పోలీస్ స్టేషన్‌లో బోర్ వెల్ ప్రారంభించిన ఎస్పీ

**విశాలభారతి వికారాబాద్**

మహిళల భద్రత మా ప్రథమ ప్రాధాన్యత అని వికారాబాద్ జిల్లా పోలీసు అధికారి స్నేహ మెహ్రా తెలిపారు. మహిళా పోలీస్ స్టేషన్ ఆధునీకరణ, సిబ్బంది సౌకర్యార్థం ప్రభుత్వం తీసుకుంటున్న చర్యల్లో భాగంగా, జిల్లా ఎస్పీ సోమవారం ఉమెన్ పోలీస్ స్టేషన్ పరిధిలో నూతన బోర్ వెల్ పనులను లాంఛనంగా ప్రారంభించారు. తెలంగాణ స్టేట్ పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ నుండి భవన మరమ్మతులు మరియు నిర్వహణ నిమిత్తం మంజూరైన నిధులతో ఈ పనులను చేపట్టినట్లు ఎస్పీ ఈ సందర్భంగా వెల్లడించారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, హౌసింగ్ కార్పొరేషన్ నుండి విడుదలైన నిధులను సద్వినియోగం చేసుకుంటూ ఉమెన్ పోలీస్ స్టేషన్ ను మరింతగా అభివృద్ధి చేయాలని, మౌలిక సదుపాయాలను మెరుగుపరచాలని స్టేషన్ ఇన్‌స్పెక్టర్ బి. సరోజా ను ఆదేశించారు. అనంతరం ఎస్పీ ఉమెన్ పోలీస్ స్టేషన్ ను తనిఖీ చేయడం జరిగింది.పోలీస్ స్టేషన్ లోని పెండింగ్ ఫైల్స్,రికార్డ్స్ లను, స్టేషన్‌లోని రిసెప్షన్ కేంద్రం, బ్యారక్స్ మరియు రైటర్ రూమ్‌లను స్వయంగా పరిశీలించిన ఎస్పీ గారు,సలహాలు, సూచనలు చేయడం జరిగింది. కేసుల దర్యాప్తుపై ప్రత్యేక దృష్టి సారించిన ఎస్పీ గారు, ప్రస్తుతం పెండింగ్‌లో ఉన్న కేసుల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. బాధితులకు త్వరితగతిన న్యాయం జరిగేలా చూడాలని, కేసుల పరిష్కారంలో ఎట్టి పరిస్థితుల్లోనూ జాప్యం వహించకూడదని స్పష్టం చేశారు. ముఖ్యంగా ఉమెన్ పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారుల పట్ల అత్యంత సున్నితంగా మరియు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. "మహిళా భద్రత మా ప్రథమ ప్రాధాన్యత. ఫిర్యాదులపై నిర్లక్ష్యం వహించకుండా, ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉంటూ విధులను నిర్వహించాలి అని ఎస్పీ సిబ్బందికి సూచించారు. పోలీస్ స్టేషన్ వాతావరణం ఫిర్యాదుదారులకు భరోసా కల్పించేలా ఉండాలని ఎస్పీ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉమెన్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ బి.సరోజా, ఎస్ఐ లు అనిత, స్రవంతి, శ్వేత మరియు రాణి లు,సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రత్యేక దృష్టి పెట్టాలి



- జిల్లా అదనపు కలెక్టర్ కదిరవన్ పలని
- కలెక్టరేట్ ప్రజావాణికి 283 దరఖాస్తులు

**విశాలభారతి సికింద్రాబాద్:**

జిల్లా లోని వివిధ ప్రాంతాల ప్రజలు ప్రజావాణిలో అందచేసిన ఆర్జీలపై అధికారు లు వెంటనే స్పందించి పరిష్కరించాలని అదనపు కలెక్టర్ కదిరవన్ పలని అధికారులను సూచించారు. సోమవారం కలె క్టరేట్ ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ జి. ముకుంద రెడ్డి, జిల్లా అదనపు కలెక్టర్ కదివన్ పలని సంయు క్తంగా ప్రజల వద్ద నుంచి దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ కదివన్ పలని మాట్లాడుతూ వివిధ సమస్యలపై ప్రజలు అందజేసిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి వెంటనే పరిష్కరించేందుకు సంబంధిత శాఖ ల అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. ప్రజల సమస్యలను పరిష్కరించడమే ప్రజావాణి ము ఖ్య ఉద్దేశమని, దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని ఆయన సూచించారు.దివ్యాంగులు అలాగే వయోవృద్ధుల వా ట్సాప్ నెంబరు ద్వారా వచ్చేఫిర్యాదులకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ పరిష్కరించాలని ఆయన సూచించారు.అలాగే జి ల్లాలో నిర్వహిస్తున్న గ్రీవెన్స్ లో వచ్చిన ధరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి, అవరమైతే క్షేత్రస్థాయిలో పర్యటించి, త్వరి తగతిన పరిష్కరించి, పెండింగ్ ఉన్న ఆర్జీల పై జాప్యం లేకుండా ప్రత్యేక దృష్టి సారించి, త్వరగా పరిష్కరించి, సంబంధిత వెబ్ సైట్ లో ఆప్‌లోడ్ చేయాలని ఆయన స్పష్టం చేశారు. ప్రజలకు ప్రజావాణి నిర్వహణపై నమ్మకం కల్పించే బాధ్యత అధి కారులపై ఉందని ఆయన తెలిపారు.ప్రజావాణిలో హౌసింగ్ శాఖకు 212, రెవెన్యూ 55, ఇతర శాఖలు 16 కలిపి మొ త్తం 283 ఆర్జీలు అందాయని అదనపు కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో హౌసింగ్ పిడి అశోక్ చక్రవర్తి, లా ఆఫీసర్ శ్రీధర్, కా ర్పొరేషన్ ఈడి రమేష్, దివ్యాంగుల శాఖ ఏ . డి రాజేందర్, జిల్లా సంక్షేమ శాఖ అధికారులు, ఆశన్న, కోటాజి, ప్రవీణ్ ,జిల్లా పరిశ్రమల శాఖ జియం ప్రవణ్ కుమార్, జిల్లా సర్వే అధికారి శ్రీరామ్,డిసిఓ ప్రసన్న, వివిధ శాఖల జిల్లా అధికా రులు, ఆర్జీదారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# విపత్తులపై విజయవంతంగా ముగిసిన మాక్ ఎక్సర్ సైజ్

- నిశితంగా పర్యవేక్షణ జరిపిన కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి
- హంగర్గ, జిల్లా జనరల్ ఆసుపత్రి, రఘునాథ చెరువు ప్రాంతాలలో కొనసాగిన మాక్ డ్రిల్
- వాస్తవికతను ఆవిష్కరించేలా సహాయక చర్యలు
- జిల్లా యంత్రాంగాన్ని అభినందించిన ప్రత్యేక పరిశీలకుడు
- విశేష సేవలు అందించిన ఎస్.డీ.ఆర్.ఎఫ్, ఎన్.సీ.సీ, ఆపదమిత్ర వాలంటీర్లు



**నిజామాబాద్, విశాలభారతి:**

వరదలు, విపత్తులు సంభవించిన సమయాలలో చేపట్టాల్సిన తక్షణ చర్యలు, తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తల విషయంలో సన్నద్ధతను తెలుసుకునేందుకు వీలుగా సోమవారం నిజామాబాద్ జిల్లాలో చేపట్టిన మాక్ ఎక్సర్ సైజ్ విజయవంతంగా కొనసాగింది. జిల్లా పాలనాధికారి టి.వినయ్ కృష్ణారెడ్డి పర్యవేక్షణలో మూడు చోట్ల ఏకకాలంలో నిర్వహించిన కార్యక్రమాలు విపత్తుల నిర్వహణలో జిల్లా యంత్రాంగం అన్ని విధాలుగా సమాయత్తం అయి ఉందన్న విషయాన్ని ప్రయోగాత్మకంగా నిరూపించాయి. విపత్తుల సమయాలలో ప్రజల ప్రాణ, ఆస్తి నష్టాన్ని నివారించేలా మాక్ ఎక్సర్ సైజ్ ద్వారా చేపట్టిన సహాయక చర్యలు వాస్తవికతను మరిపించేలా చేశాయి. అన్ని శాఖలు పరస్పర సమన్వయంతో వ్యవహరిస్తూ, విపత్తుల సమయాలలో ఏవిధంగా వ్యవహరించాలన్నది కళ్ళకు కట్టినట్టు ఆచరణాత్మక రూపంలో చేసి చూపించారు. డ్రోన్ లు, వాటర్ బోట్ లు, అంబులెన్స్ లు, అగ్నిమాపక శకటాలు, ఇతర అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ చేపట్టిన సహాయక చర్యలు విపత్తుల నిర్వహణపై సన్నద్ధతను చాటిచెబుతూ ప్రజల్లో నమ్మకాన్ని పెంపొందింపజేశాయి. ఆయా శాఖల అధికారులతో పాటు ఎస్.డీ.ఆర్.ఎఫ్, ఎన్.సీ.సీ, ఆపదమిత్ర వాలంటీర్లు మాక్ డ్రిల్ విజయవంతానికి దోహదపడ్డారు. కార్యక్రమం నిర్వహణ సందర్భంగా ఎక్కడ కూడా ఎలాంటి లోటుపాట్లు, తప్పిదాలు జరుగలేదని అన్నారు. ఇదే తరహా స్ఫూర్తిని కొనసాగిస్తూ, విపత్తుల నిర్వహణపై ఎప్పటికప్పుడు ఆధునిక సాంకేతికతను వినియోగించుకుంటూ సామర్థ్యాన్ని పెంపొందించుకోవాలని, ప్రకృతి వైపరీత్యాలు సంభవించిన సమయాలలో సమర్థవంతంగా సేవలు అందించాలని సూచించారు. మాక్ ఎక్సర్ సైజ్ కార్యక్రమాలలో సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఎరువుల గోడౌన్‌ను తనిఖీ చేసిన కలెక్టర్



**నిజామాబాద్, విశాలభారతి:** బోధన్ మండలం మావందిఖుర్దు గ్రామంలో సహకార సంఘం ఆధ్వర్యంలో కొనసాగుతున్న ఎరువుల గోడౌన్ ను కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. గిడ్డంగిలో నిలువ ఉన్న ఎరువులను పరిశీలించారు. స్టాక్ బోర్డుపై ప్రదర్శించిన వివరాలకు అనుగుణంగా నిల్వలు ఉన్నాయా అని గమనించారు. యాసంగి సీజన్ లో ఎంత మొత్తంలో యూరియా ఎరువు అవసరం పడుతుందని ఆరా తీశారు. స్టాక్ కొంత మిగిలి ఉండగానే, ఇండెంట్ పెట్టి కొత్త స్టాక్ తెప్పించుకోవాలని వ్యవసాయ అధికారులకు సూచించారు. ప్రైవేట్ డీలర్లు కూడా నిబంధనలను పాటిస్తూ, ఎరువుల విక్రయాలు జరిపేలా పర్యవేక్షణ చేయాలని సూచించారు. ప్రస్తుత ఖరీఫ్ తరహాలోనే యాసంగి సీజన్ కు సంబంధించి కూడా ఎరువుల కొరత తలెత్తకుండా రైతుల అవసరాలకు సరిపడా ఎరువులు అందుబాటులో ఉండేలా ఇప్పటి నుండే ప్రణాళికాబద్ధంగా వ్యవహరించాలని అన్నారు. ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా సజావుగా ఎరువుల పంపిణీ జరగాలని సూచించారు. కలెక్టర్ వెంట స్థానిక అధికారులు ఉన్నారు.

# బబ్బురి శ్రీకాంత్ గౌడ్ ఆధ్వర్యంలో ప్రమాణ స్వీకారం



**దేవరుప్పుల, విశాలభారతి:** మండలం పెద్దమడూర్ గ్రామంలో నూతనంగా ఎన్నికైన సర్పంచ్ పానుగంటి గిరి, ఉప సర్పంచ్, వార్డు సభ్యుల ప్రమాణ స్వీకార కార్యక్రమంలో పాల్గొని నూతన పాలక వర్గాన్ని శాలువాతో సన్మానించి, గ్రామ అభివృద్ధికి తోడ్పడుకుంటూ, ప్రభుత్వ పథకాలు అమలుపరచుకునే విధంగా పోరాటం చేసి గ్రామ అభివృద్ధికి తోడ్పడగలని, ప్రజల హృదయాల్లో మనం అనే గుర్తింపు తెచ్చుకున్న ఈ గెలుపుతో ఇంకా సహృదయాలతో పాటుపడాలని కోరారు. శుభాకాంక్షలు తెలిపిన బిఆర్ఎస్ జనగామ జిల్లా నాయకుడు బబ్బూరి శ్రీకాంత్ గౌడ్.

# ప్రజావాణికి 68 ఫిర్యాదులు



**నిజామాబాద్, విశాలభారతి:** ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్ అధికారులకు సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 68 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను అదనపు కలెక్టర్ తో పాటు నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, హౌసింగ్ పీ.డీ పవన్ కుమార్, జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈఓ సాయన్నలకు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. కాగా, అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# నూతన సర్పంచ్, ఉపసర్పంచ్‌ల ప్రమాణ శ్రీకారం




**నిజామాబాద్, విశాలభారతి:** మాక్లూర్ మండలంలోని అమ్రాద్ గ్రామంలో సోమవారం నూతనంగా ఎన్నికైన సర్పంచులు, సూరాజి లక్ష్మి, ఉప సర్పంచ్ కూరపాటి సతీష్ కుమార్ లను ఏండిఓ బ్రహ్మానందం ఆధ్వర్యంలో మరియు సీఎం ఆదేశాల మేరకు నూతన సర్పంచ్ లు ప్రమాణం శ్రీకారం చేశారు. వార్డు సభ్యులు, ఉప సర్పంచులు ప్రమాణ శ్రీకారం చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ సూరాజి లక్ష్మీ మాట్లాడుతూ.. గ్రామాన్ని అభివృద్ధి స్థానంలో నడిపిస్తానని, నాకు చదువు లేకున్న వయసు:(70) వయసుగల నన్ను ఆదరించి నన్ను గెలుపొందించినందుకు ప్రజలకు ఎల్లవేళల రుణపడి పని చేస్తానని ప్రజలకు తెలిపారు. మొట్టమొదటిగా నా గ్రామంలో గ్రామ పంచాయతీనీ నూతన భవనాన్ని నిర్మాణ కోసం భూమి పూజ నిర్వహించారు. ప్రజలకు ఎప్పుడూ అందుబాటలో ఉంటానని తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ జలేందర్, ఎంపీటిసి రత్నం, మాజీ సర్పంచ్ లింగం సొసైటీ ఛైర్మన్ శ్రీనివాస్ గౌడ్ పంచాయత్ కార్యదర్శి మహేష్ గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు గ్రామ యువకులు ఆయా శాఖ అధికారులు నూతన కమిటీని ఘనంగా సన్మానించారు.

# భార్య సర్పంచ్.. భర్త ఉప సర్పంచ్



**నిజామాబాద్, విశాలభారతి:** మాక్లూర్ మండలంలోని మదనపల్లి గ్రామంలో నూతనంగా గ్రామ అధిపతులుగా భార్యాభర్తలు సర్పంచ్ లావణ్య ఉపసర్పంచ్ మహేష్ సోమవారం తమ పదవి బాధ్యతలను స్పెషల్ అధికారి పద్మ ఆధ్వర్యంలో స్వీకరించారు. వారి సందర్భంగా మాట్లాడుతూ గ్రామ ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి గ్రామంలో ఎటువంటి సమస్యలు అయినా పరిష్కరిస్తామని మరియు గ్రామ ప్రజలు మాకు ఈ అవకాశాన్ని ఇచ్చిన అందుకు శిరస్సు వంచి పాదాభివందనాలు తెలియజేస్తున్నామని సభముఖంగా తెలిపారు గ్రామంలో ఎటువంటి సమస్యలు అయినా ఉన్న వాటిని ఆర్మూర్ నియోజక వర్గం ఇన్చార్జి కాంగ్రెస్ పార్టీ వినయ్ రెడ్డికి దృష్టికి తీసుకువెళ్లి గ్రామం అభివృద్ధి కోసం నిధులు తీసుకొచ్చి డెవలప్ చేస్తామని వారు అన్నారు ఈ కార్యక్రమంలో నూతనంగా ఎన్నుకోబడ్డ గ్రామ వార్డు సభ్యులు గ్రామ మాజీ సర్పంచ్ శంకర్ గౌడ్ సొసైటీ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్ మాజీ సర్పంచ్ నరసయ్య మాజీ ఎంపీటీసీ ఒడ్డెన్న గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు అధికారులు పాల్గొన్నారు.

# ఘనంగా శ్రీనివాస రామానుజన్ 138వ జయంతి



**తిరుమలగిరి, విశాలభారతి:** శ్రీనివాస రామానుజన్ జయంతి సందర్భంగా జెడ్పిహెచ్ఎస్ తొండ యందు జాతీయ గణిత దినోత్సవం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమం లో విద్యార్థుల్లో దాగి ఉన్న గణిత ప్రతిభ పాటవాలను వెలికి తీయడానికి మండల స్థాయిలో టాలెంట్ టెస్ట్, ఎస్సే రైటింగ్, ఉపన్యాస పోటీలను నిర్వహించి, గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి ఐ శాంతయ్య, దామెర శ్రీనివాస్, తొండ సర్పంచ్ స్వాతి, టీఎంఎఫ్ జిల్లా బాధ్యులు అంజాద్, మండల శాఖ అధ్యక్షుడు దామెల్ల ఎల్లయ్య, మండలంలోని గణిత ఉపాధ్యాయులు పాల్గొనడం జరిగింది. ఈ కార్యక్రమానికి దాతగా సంకేపల్లి విట్ట్ రెడ్డి వ్యవహరించారు.

# తూర్పు తండా గ్రామ పంచాయతీలో కాంగ్రెస్‌కు మరింత బలం

**ఉప సర్పంచ్‌గా లావడ్య కవిత రవి ప్రమాణ స్వీకారం**



**మహబూబాబాద్, విశాలభారతి:** మహబూబాబాద్ జిల్లా తూర్పు తండా గ్రామ పంచాయతీలో కాంగ్రెస్ పార్టీకి మరింత బలం చేకూరింది. ఇటీవల నిర్వహించిన గ్రామ పంచాయతీ సమావేశంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన లావడ్య కవిత రవి ఉప సర్పంచ్‌గా అధికారికంగా ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని కవిత రవికి శుభాకాంక్షలు తెలిపారు. ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని, అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేస్తానని ఉప సర్పంచ్ లావడ్య కవిత రవి హామీ ఇచ్చారు. గ్రామంలో మౌలిక వసతులు, తాగునీరు, రహదారులు, పారిశుధ్యం వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారిస్తామని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా కృషి చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంతో తూర్పు తండా గ్రామ పంచాయతీలో కాంగ్రెస్ పార్టీ ప్రాభవం మరింత పెరిగిందని నాయకులు అభిప్రాయపడ్డారు.

# స్వస్తిక్ కాన్సెప్ట్ స్కూల్లో ఘనంగా శ్రీనివాస రామానుజన్ జయంతి



**మహబూబాబాద్, విశాలభారతి:** మహబూబాబాద్ పట్టణంలో గల స్వస్తిక్ కాన్సెప్ట్ స్కూల్ విద్యార్థిని విద్యార్థుల ఆనందోత్సాహాల మధ్య, భారతదేశ ప్రసిద్ధ గణిత శాస్త్రవేత్త శ్రీ శ్రీనివాస రామానుజన్ జయంతిని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి ఘనంగా కార్యక్రమాన్ని నిర్వహించారు. పాఠశాల ఆవరణలో జరిగిన జయంతి వెల్కం కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ శ్రీ కె చంద్రమౌళి మాట్లాడుతూ యావత్ భారతదేశం ప్రతి సంవత్సరం డిసెంబర్ 22న కన్నుల పండుగ జరుపుకునే జాతీయ గణిత దినోత్సవాన్ని పురస్కరించుకొని శ్రీనివాస రామానుజన్ ఆయన దేశానికి చేసిన సేవలను మరియు గణిత శాస్త్రానికి తోడ్పాటునందించిన విధానాన్ని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. ఒక వ్యక్తికి ఒక అంశం పట్ల ప్రత్యేకమైన అభిరుచి ఉంటే ప్రపంచం గుర్తుపెట్టుకునే విధంగా తయారవ్వవచ్చునని శ్రీనివాస రామానుజన్ జీవితం ఒక ఉదాహరణ అని తెలియజేశారు. ప్రతి విద్యార్థి గణితం పట్ల ప్రత్యేకమైన ఆసక్తిని ఏర్పరచుకొని తద్వారా గణితం సబ్జెక్టుని సునాయాసంగా నేర్చుకోవాలని, బాల్యం నుంచే గణితం పట్ల ప్రత్యేకమైన అవగాహన కలిగి ఉండి సాధన చేయడం ద్వారా ప్రతి ఒక్క విద్యార్థి ఆత్మవిశ్వాసంతో వారి వారి జీవితంలో సాధించాల్సిన లక్ష్యాలను అలవోకగా సాధించవచ్చు అని తెలియజేశారు. అనంతరం విద్యార్థిని విద్యార్థులు గణిత శాస్త్రం పట్ల అభిరుచి తో తయారు చేసినటువంటి గణిత ఎగ్జిబిట్లను ప్రదర్శించి, వారు సృజనాత్మకతతో తయారుచేసిన ప్రాజెక్టులను తోటి విద్యార్థిని విద్యార్థులకు విషద పరుస్తూ చాలా సంతోషాన్ని వ్యక్తం చేశారు. ప్రాజెక్టు తయారు చేసినటువంటి విద్యార్థిని విద్యార్థులను చైర్మన్ మరియు ప్రిన్సిపల్ ప్రశంసించారు అనంతరం బహుమతులను వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ చంద్రమౌళి పాఠశాలలోని ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు విద్యార్థిని విద్యార్థులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# సర్పంచుల ప్రమాణ స్వీకారం




**దేవరుప్పుల, విశాలభారతి:** మండలం సింగరాజు పల్లి గ్రామంలో నూతనంగా సర్పంచిగా కొండ ఊర్మిళ మల్లారెడ్డి ప్రమాణ స్వీకారం చేసిన అనంతరం గ్రామ వార్డు మెంబర్లను అభినందించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, గ్రామ అభివృద్ధి ప్రధాన లక్ష్యంగా ప్రతి వార్డ్ మెంబర్ నాయకులు గ్రామ ప్రజలు అందరూ కలిసికట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. గ్రామంలో మౌలిక వసతుల అభివృద్ధి పరిశుభ్రత తాగునీటి సదుపాయాలు రోడ్లు డ్రైనేజీ సంక్షేమ పథకాల అమలు వంటి అంశాలపై సమన్వయంతో ముందుకు సాగుదామని, తెలిపారు. రాజకీయ వేదాలను పక్కనపెట్టి గ్రామ సంక్షేమం కోసం ఐక్యంగా పనిచేస్తూనే సింగరాజుపల్లి గ్రామం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తుందని అన్నారు. ప్రతి వార్డు మెంబర్ సూచనలు సహకారం తీసుకుంటూ, పారదర్శక పాలన అందిస్తామని సర్పంచ్ కొండ ఊర్మిళ మల్లారెడ్డి ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

# టిప్పర్ ఢీకొని ఏఆర్ ఎస్ఐ మృతి

**మేడిపల్లి, విశాలభారతి:** మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో నారపల్లి దగ్గరలోఘోర రోడ్డు ప్రమాదం సంభవించింది. టిప్పర్ ఢీకొనడంతో ఏఎస్ఐ అక్కడికక్కడే మృతి చెందారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... అన్నోజిగూడకు చెందిన జగ్గాని రఘుపతి యాదవ్ (59) ఖైరతాబాద్ ఇంటెలిజెన్స్ ఎ ఆర్ఎస్ఐగా పనిచేస్తున్నారు. సోమవారం తన విధులు ముగించుకొని తిరిగి ద్విచక్ర వాహనంపై వస్తుండగా ఉప్పల్ నుంచి వరంగల్ వెళ్లే హైవేపై నారపల్లి మసీదు దగ్గర వెనుక నుండి వచ్చిన టిప్పర్ ఢీకొట్టింది. దీంతో బైక్‌పై నుండి లారీ కింద పడటంతో అతడి తల మీద నుండి టైర్ పోయింది. దీంతో అక్కడికక్కడే మృతి చెందారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు టిప్పర్‌ను సీజ్ చేసి డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.







# ఉపాధిహామీ చట్టాన్ని నీరుగార్చే బిల్లును ఉపసంహరించుకోవాలి



**కోదాడ, విశాలభారతి:**

కేంద్రంలో అధికారంలో వున్న బిజెపి ప్రభుత్వం ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేస్తూ పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన జి రామ్ జి బిల్లు వ్యవసాయ కార్మికులకు, పేదలకు తీవ్రమైన నష్టం కలిగిస్తుందని కేంద్ర ప్రభుత్వం తక్షణమే ఈ బిల్లును ఉపసంహరించుకోవాలని సిపిఎం మండల కార్యదర్శి బెల్లంకొండ సత్యనారాయణ డిమాండ్ చేశారు. సోమవారం సిపిఎం మండల కమిటీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో బస్టాండ్ సెంటర్లు పార్లమెంటులో ప్రవేశపెట్టిన ఉపాధి హామీ కొత్త బిల్లును వ్యతిరేకిస్తూ బిల్లు కాపీలని దగ్ధం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం తన అంగ బలంతో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం రద్దుచేసి ఆ స్థానంలో జి రాంజీ ఉపాధి బిల్లును తీసుకురావడం జరిగిందని, ఇది దేశంలోని వ్యవసాయ కార్మికులకు, పేద రైతులకు తీవ్ర నష్టమని అన్నారు. ఉపాధి హామీ పథకానికి ఉన్నమహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టానికి గాంధీ పేరు మార్చి జి రాంజీ పేరు పెట్టడం సమంజసం కాదన్నారు. ప్రతి కుటుంబానికి 100 రోజుల పని నుండి 125 రోజులు పెంచుతున్నామని ఎన్ డి ఏ ప్రభుత్వం పార్లమెంటులో వాదించడం దుర్మార్గమని అన్నారు. కోట్లాదిమంది గ్రామీణ వ్యవసాయ కార్మికులు, ఇతర పేదలకు భరోసాగా ఉన్న 100 రోజులు పని కల్పించే మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం రద్దు చేయాలని ఆలోచన బిజెపి ప్రభుత్వం అనేక సంవత్సరాలుగా ప్రయత్నం చేస్తూ వచ్చిందని ఈ ఆలోచన తుది రూపం జి రామ్ జి బిల్లు అన్నారు. జి రామ్ జి బిల్లు ద్వారా గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని కాస్త పథకం రూపంలోకి మార్పు చేశారని ఆయన విమర్శించారు. రానున్న కాలంలో గ్రామీణ పేదలు పనిని హక్కుగా పొందే అవకాశం ఉండదని అన్నారు. జి రాంజీ ఉపాధి బిల్లులో 60 శాతం కేంద్ర ప్రభుత్వం నిధులు 40 శాతం రాష్ట్ర ప్రభుత్వం నిధులు కేటాయించాలని పేర్కొనటం ఉపాధి చట్టాన్ని నీరుగార్చటమే అన్నారు. దీనివల్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దయా దాక్షిణ్యాల మీదనే ఈ పథకం అమలు కావడానికి అవకాశం ఉందని విమర్శించారు. పని ప్రదేశాలలో యంత్రాల వినియోగం పై ఉన్న నిషేధాన్ని కూడా ఈ బిల్లులో ఎత్తివేశారని, ఇది కాంట్రాక్టర్లకు అనుకూలమైన నిర్ణయం అని అన్నారు. 2004 లో సిపిఎం వామపక్ష పార్టీల మద్దతుతో ఏర్పడిన యూపీఏ ప్రభుత్వంపై వత్తిడి చేసి గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని సిపిఎం, వామపక్ష పార్టీలు తీసుకు వచ్చాయని గుర్తు చేశారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా జిల్లా కమిటీ సభ్యులు బెల్లంకొండ వెంకటేశ్వర్లు మాజీ వైఎస్ ఎంపిపి కొరట్ల శ్రీనివాస్ ఎస్కే లతీఫ్ బాబు, బీరవల్లి సుధాకర్ రెడ్డి, సీతారాం రెడ్డి, అలంతుల కృష్ణయ్య, మల్లెల ఎంకన్న, కాసాని వినోద్, వీరబాబు కృష్ణ, కళ్యాణ్, శ్రీను ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

# గ్రామపంచాయతిలో సర్పంచ్ వార్డు సభ్యుల ప్రమాణ స్వీకారం

**ప్రమాణస్వీకారం చేసిన నూతన సర్పంచ్, ఉపసర్పంచ్, వార్డు సభ్యులు**



**మొయినాబాద్, విశాలభారతి:**

గ్రామాలలో నూతన పాలకవర్గం కొలువుదీరాయి. గ్రామాల్లో ప్రమాణస్వీకారం సందడి నెలకొంది. నూతనంగా ఎన్నికైన సర్పంచ్, ఉపసర్పంచ్, వార్డు సభ్యులు గ్రామపంచాయతీ పదవి బాధ్యతలను స్వీకరించారు. సోమవారం ప్రమాణస్వీకారం కార్యక్రమానికి సంబంధిత అధికారులు ఏర్పాట్లు చేశారు. మొయినాబాద్ మండల పరిధిలోని మొత్తం 19 గ్రామపంచాయతీలు 166 వార్డులు ఉండగా.. అందులో 9మంది వార్డు సభ్యులు ఏకగ్రీవం కాగా 19 సర్పంచ్, 157 వార్డులకు ఎన్నికలు జరిగాయి. మొత్తంగా 19 మంది సర్పంచ్ లు 166 మంది వార్డు సభ్యులుగా గెలిచారు. అనంతరం ఉప సర్పంచ్ లను ఎన్నుకున్నారు. నూతనంగా ఎన్నికైన సర్పంచ్, ఉపసర్పంచ్, వార్డు సభ్యులు సోమవారం ఆయా గ్రామపంచాయతీలలో ప్రమాణ స్వీకారం చేశారు. కొన్ని గ్రామాల్లో ప్రజా ప్రతినిధుల సమక్షంలో ప్రమాణ స్వీకారం చేశారు. అమ్డాపూర్ గ్రామ సర్పంచ్ గా మద్యపాగ కృష్ణ 10:30 గంటలకు న్యాయవాది కడుమూరి ఆనంద్ సమక్షంలో ప్రమాణస్వీకారం చేశారు. శ్రీరాంనగర్ గ్రామంలో స్థానిక చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి సమక్షంలో ఏర్పుల గీతా మహిపాల్, రెడ్డిపల్లి, బాకారం గ్రామలలో సైతం ఎంపీ విశ్వేశ్వర్ రెడ్డి చేతుల మీదగా సర్పంచ్ గా వెంకటేష్ గౌడ్, షాపురం రాజు, ఎత్బర్‌పల్లి గ్రామంలో చింతకింది ప్రవీణ్ రెడ్డి స్థానిక ఎమ్మెల్యే కాలే యాదయ్య సమక్షంలో మేడిపల్లి గ్రామంలో చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే బిజెపి ఇన్చార్జి కెఎస్.రత్నం చేతుల మీదగా మల్కాపురం శ్రీనివాస్ లు ప్రమాణ స్వీకారం చేసి తమ బాధ్యతలను స్వీకరించారు. ఈ కార్యక్రమలలో ఆయా మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# సమగ్ర అభివృద్ధి సాధించడమే లక్ష్యం

- అయ్యవారి గూడ గ్రామ సర్పంచ్‌గా నక్క అలివేలు వెంకటేష్ ప్రమాణ స్వీకారం

**ఇబ్రహీంపట్నం, విశాలభారతి:**

గ్రామపంచాయతీలో సమగ్ర అభివృద్ధి సాధించడమే లక్ష్యంగా పనిచేస్తానని యాచారం మండలంలోని అయ్యవారిగూడ గ్రామ సర్పంచ్ నక్క అలివేలు వెంకటేష్ పేర్కొన్నారు. సోమవారం సర్పంచ్ తోపాటుగా పాలకవర్గం ప్రమాణ స్వీకారం చేశారు. ఉప సర్పంచ్ గా సభావట్ కిషన్ ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ నక్క అలివేలు వెంకటేష్ మాట్లాడుతూ.. నమ్మకంతో సర్పంచ్ గా ఎన్నుకోవడంతో ప్రజలందరికీ కృతజ్ఞతలు తెలిపారు. సహకారానికి ఎల్లప్పుడూ రుణపడి ఉంటాను. సమస్యల పరిష్కారానికి సభ్యుల సమన్వయంతో, అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే దిశగా కృషి చేస్తానన్నారు. అంతకుముందు సర్పంచ్, ఉప సర్పంచ్ ల నివాసాల నుండి పంచాయతీ కార్యాలయం వరకు బాణసంచా కాలుస్తూ, డప్పుల సప్పుల్లతో శోభాయాత్ర నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సునీల్, పాలకవర్గం సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



# నూతన గ్రామ పాలకవర్గాల ప్రమాణ స్వీకరణ అట్టహాసం



**విశాలభారతి, అబ్దుల్లాపూర్ మెట్ :**

ఇబ్రహీంపట్నం నియోజకవర్గం, అబ్దుల్లాపూర్మెట్ మండల పరిధిలో ఇటీవల నిర్వహించిన గ్రామపంచాయతీ ఎన్నికల్లో నూతనంగా ఎన్నికైన 14 మంది సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లు 134 మంది వార్డు సభ్యుల ప్రమాణ స్వీకరణ కార్యక్రమం సోమవారం ఘనంగా జరిగింది. గెలుపొందిన ప్రజాప్రతినిధులు పార్టీ కార్యకర్తలు, అభిమానులతో కలిసి ఊరేగింపుగా గ్రామపంచాయతీ కార్యాలయాలకు చేరుకున్నారు. అనంతరం ప్రభుత్వం నియమించిన ఆయా గ్రామాల ప్రత్యేక అధికారులు, గ్రామ కార్యదర్శులు నూతనంగా ఎన్నికైన సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లు, వార్డు సభ్యులతో అధికారికంగా ప్రమాణ స్వీకారం చేయించారు.

**ప్రమాణ స్వీకారం చేసిన సర్పంచ్‌లు**

అబ్దుల్లాపూర్ మెట్ - మందుగుల విజయ శ్రీశైలం
గండి చెరువు - జక్కా రవీందర్ రెడ్డి
జాఫర్ గూడా - ఎర్ర వెంకటేష్
ఉప సర్పంచ్ - బద్దం జంగారెడ్డి
కవాడి పల్లి - కొలను ప్రసన్నలక్ష్మి
ఉప సర్పంచ్ - రసాల రమేష్
పిగిలిపూర్ (ఏకగ్రీవం) - కోట ప్రభాకర్ రెడ్డి
బండ రావిర్యాల - కందికంటి విజయ్
బాటసింగారం - ఎర్రవెల్లి గౌరీ శంకర్ చారి
ఉప సర్పంచ్ - నార్లకొండ వెంకటేష్
అనాజ్ పూర్ - రాచపాక నవనీత
ఇనాం గూడ - దేశారం రాఘవేందర్
గుంతపల్లి - అంతటి హేమలత
మజీద్పూర్ - మేడిపల్లి ప్రియా

బలిజగూడ - ఉప్పు మాధవి నవీన్ అలాగే ఆయా గ్రామాల ఉప సర్పంచ్‌లు, వార్డు సభ్యులు గ్రామపంచాయతీ అధికారుల సమక్షంలో ప్రమాణ స్వీకారం చేశారు. ప్రమాణ స్వీకారం అనంతరం ప్రత్యేక అధికారులు నూతన సర్పంచ్‌లను వారికి కేటాయించిన స్థానాల్లో అధికారికంగా కూర్చోబెట్టి సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా సర్పంచ్‌లు మాట్లాడుతూ.. తమను గెలిపించిన గ్రామ ప్రజలకు కృతజ్ఞతలు తెలియజేస్తూ, రాబోయే రోజుల్లో ప్రజల సహకారంతో గ్రామాభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తామని తెలిపారు. గ్రామ సమస్యలపై సమిష్టిగా చర్చించి నిర్ణయాలు తీసుకుంటూ, అన్ని వర్గాల అభివృద్ధికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. గ్రామ పెద్దలు, స్థానిక ప్రజలు, అభిమానులు, గ్రామపంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

## కొలువుదీరిన కొత్త పాలకవర్గం

- నానక్ నగర్ గ్రామ సర్పంచ్ గా సంఘం చైతన్య రాజ్ ప్రమాణ స్వీకారం
- గ్రామాన్ని అభివృద్ధి దిశలో తీసుకెళ్తాను



**ఇబ్రహీంపట్నం, విశాలభారతి:** రంగారెడ్డి జిల్లా యాచారం మండలంలోని నానక్ నగర్ గ్రామంలో సర్పంచ్ తో పాటుగా నూతన పాలకవర్గం కొలువుదీరింది. ఈ సందర్భంగా సర్పంచ్ చైతన్య రాజ్ మాట్లాడుతూ.. నమ్మకంతో సర్పంచ్ గా ఎన్నుకోవడంతో ప్రజలందరికీ కృతజ్ఞతలు తెలిపారు. సహకారానికి ఎల్లప్పుడూ రుణపడి ఉంటాను. సమస్యల పరిష్కారానికి సభ్యుల సమన్వయంతో, అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే దిశగా కృషి చేస్తానన్నారు. ప్రజలకు తాను నాయకునిగా కాకుండా సేవకునిగా పని చేస్తానని అన్నారు. ఈ ఆదర్శ గ్రామం ఇప్పటికే అన్ని రంగాల్లో అభివృద్ధిలో దూసుకుపోతోందని, అన్ని వర్గాల ప్రజలు, గ్రామ అభివృద్ధి కమిటీ సహకారంతో మరింత అభివృద్ధి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి , పాలకవర్గం సభ్యులు , గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## సర్పంచ్‌గా ప్రమాణ స్వీకారం నాడే ఇచ్చిన మాట అమలు

**స్వంతంగా ఇద్దరికి పెన్షన్ అందజేసిన సంగెం గ్రామ సర్పంచ్ వేణుగోపాల్**



**కేశంపేట, విశాలభారతి:** గ్రామ సర్పంచ్ గా ప్రమాణ స్వీకారం చేసిన మొదటి రోజే ఎన్నికల ప్రచారంలో భాగంగా ఇద్దరు వ్యక్తులకు ఇచ్చిన మాటను నిలబెట్టుకొన్నాడు ఆ గ్రామ సర్పంచ్. కేశంపేట మండలం సంగెం గ్రామంలోని గ్రామపంచాయతీ కార్యాలయంలో సోమవారం పంచాయతీ నూతన పాలక వర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమం జరిగింది. ఇందులో భాగంగా గ్రామ సర్పంచ్ గా గన్నోజు వేణుగోపాల చారి, ఉప సర్పంచ్ గా ఎండి షకిల్ , వార్డు సభ్యులు ప్రమాణస్వీకారం చేశారు. అనంతరం గ్రామ సర్పంచ్ వేణుగోపాల్ చారి తాను ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నప్పుడు గ్రామానికి చెందిన పుట్టోని గూడెం లక్ష్మమ్మ, జోగు అన్న గూడెం నరసింహులు తమకు పెన్షన్ రావడంలేదని , ఎలాగైనా ఆదుకోవాలని కోరారు. ఈ నేపథ్యంలోనే తాను సర్పంచ్ గా గెలిచిన తర్వాత మీకు ప్రభుత్వం నుండి పెన్షన్ అందే వరకు సొంతంగా నేనే మీకు పెన్షన్ ఇచ్చి ఆదుకుంటానని హామీ ఇచ్చాడు. నాడు ఇచ్చిన హామీ మేరకు సర్పంచ్ గా ప్రమాణ స్వీకారం చేసిన వెంబడే సదరు వార్డు సభ్యురాలి ఆధ్వర్యంలో ఇద్దరు వ్యక్తులకు ఒక్కొక్కరికి రెండు వేలచొప్పున నగదు అందజేసి ఇచ్చిన మాట నిలబెట్టుకోవడం పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

## ప్రజావాణి ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి

**జిల్లా అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి**



**రంగారెడ్డి, విశాలభారతి:** ప్రజావాణిలో ప్రజలు సమర్పించిన ఫిర్యాదులకు అధిక ప్రాధాన్యతనిస్తూ సత్వరమే పరిష్కరించాలని జిల్లా అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి( రెవెన్యూ ) సంబంధిత అధికారులను ఆదేశించారు.సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా తమ సమస్యలు తెలపడానికి వచ్చిన ప్రజల నుండి ఫిర్యాదులను జిల్లా జిల్లా అదనపు కలెక్టర్ చంద్రా రెడ్డి, ( రెవెన్యూ ) డీఆర్ఓ సంగీతతో కలిసి స్వీకరించారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో శాఖల వారిగా స్వీకరించిన ఫిర్యాదులను సంబంధిత జిల్లా అధికారులు సత్వర పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.ప్రజావాణి కార్యక్రమానికి మొత్తం 29 ఫిర్యాదులు వచ్చాయని,రెవెన్యూ శాఖకు సంబంధించి 06, ఇతర శాఖలకు సంబంధించి 23, దరఖాస్తులు అందాయి.ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి సంగీత, వివిధ శాఖల జిల్లా అధికారులు, మున్సిపల్ అధికారులు, మండల తహశీల్దారులు, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాల విద్యారులకు స్వెట్టర్ల పంపిణీ




**మొయినాబాద్, విశాలభారతి:** చలి తీవ్రతను దృష్టిలో ఉంచుకుని విద్యార్థుల ఆరోగ్యం కోసం తోడు నీడ ఫౌండేషన్ అండగా నిలిచింది. మొయినాబాద్ మండల పరిధిలోని రెడ్డిపల్లి గ్రామం గలలో ప్రభుత్వ పాఠశాలలో 100 మంది విద్యార్థులకు ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు రాజేశ్వరి స్వెట్టర్లను అందజేశారు.ఈ సందర్భంగా రాజేశ్వరి మాట్లాడుతూ.. శివారు గ్రామాల్లోని నిరుపేద విద్యార్థులు చలి తీవ్రత వల్ల పడుతున్న ఇబ్బందులను గమనించి. విద్యార్థులకు స్వెటర్లు పంపిణీ చేశామని, విద్యార్థులు చదువుపై ఏకాగ్రత వహించాలనే ఉద్దేశంతో తమ ఫౌండేషన్ తరపున ఈ చిన్న సాయం అందించామన్నారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సెక్రటరీ రాజేష్, పాఠశాల హెడ్ మాస్టర్,ముజీబ్ ,రవీందర్ , శివ కుమార్, పూర్ణ చంద్రరావు,శకుంతల, కవిత, సుధాకర్ ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం విద్యార్థులు రాజేశ్వరి, రాజేష్ లకు ధన్యవాదాలు తెలుపుతూ.. పదవతరగతి లో మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధిస్తామని చెప్పారు.

## చేవెళ్లలో షీ టీమ్స్ అవగాహన సదస్సు

**షీ టీమ్ ఇన్‌చార్జి శ్యామ్ సుందర్ ఎస్ఐ**

**మొయినాబాద్, విశాలభారతి:** చేవెళ్ల షీ టీమ్స్ బృందం ఆధ్వర్యంలో టీజీఎస్ డబ్ల్యూఆర్ఎస్ స్కూల్ అండ్ జూనియర్ కాలేజ్, చేవెళ్ల బ్రాంచ్ (తోల్కట్ట) లో విద్యార్థులు, ఉపాధ్యాయుల కోసం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో షీ టీమ్స్ పాత్ర, పోక్సో చట్టం, నిర్భయ చట్టం, సైబర్ నేరాలు, మానవ అక్రమ రవాణా వంటి అంశాలపై విస్తృతంగా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాల్గొన్న చేవెళ్ల షీ టీమ్ ఇన్‌చార్జి శ్యామ్ సుందర్ ఎస్ఐ మాట్లాడుతూ, అమ్మాయిలు తమ వ్యక్తిగత వివరాలను ఎక్కడా షేర్ చేయకూడదని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో డయల్ 100, 112కి, సైబర్ నేరాల కోసం 1930కి, బాల్య వివాహాలు లేదా చిన్నపిల్లలకు ఏదైనా ఇబ్బంది ఎదురైతే చైల్డ్ హెల్ప్‌లైన్ 1098కి సమాచారం ఇవ్వాలని తెలిపారు. ఈవ్‌టీజింగ్ ఘటనలపై చేవెళ్ల డివిజన్ షీ టీమ్ నంబర్ 8712663673కి, సైబరాబాద్ వాట్సాప్ నంబర్ 8712663061కి ఫిర్యాదు చేయాలని సూచించారు. అలాగే సోషల్ మీడియా వినియోగం, ఓటీపీ మోసాలు, ఆన్‌లైన్ గేమ్స్ విషయంలో జాగ్రత్తగా ఉండాలని, విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్ వంటి సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లలో అమ్మాయిలు ఒంటరి ఫొటోలు లేదా ఇతర ఫొటోలు అప్లోడ్ చేయకూడదని, ఎవరితోనూ షేర్ చేయకూడదని హెచ్చరించారు. చిన్నపిల్లలకు 'గుడ్ టచ్ – బ్యాడ్ టచ్'పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో షీ టీమ్ ఇన్‌చార్జి శ్యామ్ సుందర్ ఎస్ఐతో పాటు సిబ్బంది జ్యోతి, రేష్మా, వైద్యనాథ్ పాల్గొన్నారు. అలాగే టీజీఎస్ డబ్ల్యూఆర్ఎస్ స్కూల్ అండ్ జూనియర్ కాలేజ్ ప్రిన్సిపాల్ మాలతి, వైస్ ప్రిన్సిపాల్ అనిత, ఇతర ఉపాధ్యాయ బృందం మరియు విద్యార్థులు హాజరయ్యారు.




## నూతన గ్రామపంచాయతీ సర్పంచ్, ఉప సర్పంచ్లు

**అడవిదేవులపల్లి, విశాలభారతి:**



1..అడవిదేవులపల్లి గ్రామపంచాయతీ సర్పంచ్ కూరాకుల చిన్నరామయ్య ఉప సర్పంచ్ బిళ్ళ కంటి రేణుక నరసింహారావు
2..జీలకర్ర కుంట తండా సర్పంచ్ కుర్ర సాలి హాము ఉప సర్పంచ్ బుజ్జి శంకర్
3..కొత్తూరు సర్పంచ్ రమావత్ జయమ్మ మౌల ఉప సర్పంచ్ సర్పంచ్ కుర్రా సుమన్
4..మొల్కచర్ల సర్పంచ్ పాతులోతు మంగిని ఉప సర్పంచ్ పాతులోతు రమేష్
5..బంగారుకుంట తండా సర్పంచ్ మూడవత్ సేవ ఉపసర్పంచ్ కుర్ర పరశురాం
6..బాలెంపల్లి సర్పంచ్ కుర్ర లక్ష్మి రమేష్ ఉప సర్పంచ్ కుర్ర బాలు
7.. చిట్యాల సర్పంచ్ నక్క వెంకటేశ్వర్లు ఉప సర్పంచ్ మేకరబోయిన విజయలక్ష్మి 8..ఉల్సాయ పాలెం సర్పంచ్ రాతలా మోతిలాల్ ఉప సర్పంచ్ పానుగోతు కమిలి
9..గోన్యతండా సర్పంచ్ పాతులోతు లక్ష్మి దేశ్య ఉప సర్పంచ్ కేతావత్ వెంకటేశ్వర్లు
10..ముదిమాణిక్యం సర్పంచ్ రమావత్. వెంకటేశ్వర్లు ఉప సర్పంచ్ పిల్లి స్వరాజ్యం 11..నల్లమిట్ట తండా సర్పంచ్ జటావత్ బాలి. ఉప సర్పంచ్ ముడావత్. రాము
12..నడిగడ్డ సర్పంచ్ మూడవత్ బంగారు ఉపసర్పంచ్ పశువుల విజయ
13..చాంప్ల తండా. సర్పంచ్ పాతులోతు సోమా
ఉప సర్పంచ్ రమావత్ మధు

## రాజకీయాలకతీతంగా గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలి



**రాష్ట్ర మార్కెఫెడ్ మాజీ డైరెక్టర్, డీసీఎమ్ఎస్ మాజీ చైర్మన్ కొత్వాల**

**పాల్వంచ, విశాలభారతి:**

పంచాయతీలకు నూతనంగా ఎన్నికైన పాలకవర్గాలు రాజకీయాలకతీతంగా గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలనీ రాష్ట్ర మార్కెఫెడ్ మాజీ డైరెక్టర్, డీసీఎమ్ఎస్ మాజీ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు అన్నారు. సోమవారం నూతన సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు సభ్యుల ప్రమాణ స్వీకారం సందర్భంగా కాంగ్రెస్ పార్టీకి చెందిన 17 మంది సర్పంచ్ ల పంచాయతీలు చంద్రాలగూడెం, రేగుల గూడెం, బంజారా, మల్లారం, లక్ష్మీదేవిపల్లి, ఉల్వనూరు, కిన్నెరసాని, పాత సూరారం, కొత్త సూరారం, పాండురంగాపురం తండా, తవిశలగూడెం లలో కొత్వాల తోపాటు కాంగ్రెస్ నాయకులు పర్యటించి, ప్రాణాస్వీకారోత్సవాలలో పాల్గొన్నారు. సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు సభ్యులను బొకే, శాలువాలతో సన్మానించి, అభినందించారు. ఈ సందర్భంగా కొత్వాల మాట్లాడుతూ నూతన పాలకవర్గాలు ఎలాంటి అవినీతికి పాల్పడకుండా, పంచాయతీని అభివృద్ధి పరచాలన్నారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి కట్టుబడి ఉందన్నారు. పంచాయతీలకు మౌలిక సదుపాయాలు కల్పించడం కాంగ్రెస్ కే సాధ్యం అన్నారు. నూతన పాలకవర్గాలు నిత్యం ప్రజలకు అందుబాటులో వుంటూ, వారి కష్టసుఖాల్లో పాలు పంచుకోవాలని కొత్వాల కోరారు. ఈ కార్యక్రమాల్లో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ జాలే జానకిరెడ్డి, మాజీ జడ్పీ చైర్మన్ బరిపటి వాసు దేవరావు, మాజీ జడ్పీటీసీ యర్రంశెట్టి ముత్తయ్య, మండల కాంగ్రెస్ అధ్యక్షులు కోండం వెంకన్న గౌడ్, కాంగ్రెస్ నాయకులు యర్రంశెట్టి మధుసూదన్ రావు, వుండేటి శాంతివర్ధన్, వెంకటేశ్వర్లు , అలెక్స్, బరిపటి ఆనంద్, ముగిస్తే ముసలయ్య, వాసం మంగయ్య, కట్టా సోమయ్య, మాజీ ఎం.పి. పి నారాయణ, నరసింహారావు, నీరుడు శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

## పగడాల రమాదేవి అనే నేనూ..!



**అశ్వారావుపేట, విశాలభారతి:**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట నియోజకవర్గం దమ్మపేట మండలంలోని దమ్మపేట గ్రామపంచాయతీ నూతన సర్పంచ్‌గా పగడాల రమాదేవి సోమవారం అధికారికంగా ప్రమాణ స్వీకారం చేశారు. ఇటీవల జరిగిన పంచాయతీ ఎన్నికల్లో గ్రామ ప్రజల విశ్వాసాన్ని చూరగొని ఘన విజయం సాధించిన ఆమె, ప్రజాస్వామ్య విలువలను కాపాడుతూ గ్రామాభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తానని ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. గ్రామ పంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ఎమ్మెల్యే జారే ఆదినారాయణ ఆధ్వర్యంలో పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు, పార్టీ నాయకులు, గ్రామ పెద్దలు మరియు స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి ఎమ్మెల్యే జారే ఆదినారాయణ మాట్లాడుతూ, గ్రామస్థాయి పాలన ప్రజలకు మరింత చేరువగా ఉండాలని, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేసి గ్రామాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాలను అర్హులైన వారికి పూర్తిస్థాయిలో అందించేందుకు కృషి చేయాలని తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్ పగడాల రమాదేవి మాట్లాడుతూ, తనపై నమ్మకం ఉంచి గెలిపించిన గ్రామ ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. గ్రామంలో తాగునీరు, పారిశుధ్యం, రోడ్లు, వీధిదీపాలు, మౌలిక వసతుల అభివృద్ధి, పేదల సంక్షేమం వంటి అంశాలకు అత్యంత ప్రాధాన్యం ఇస్తానని స్పష్టం చేశారు. ప్రభుత్వ పథకాలను పారదర్శకంగా అమలు చేస్తూ అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా చర్యలు తీసుకుంటానని తెలిపారు. గ్రామాభివృద్ధిలో ప్రజల సహకారం ఎంతో అవసరమని పేర్కొంటూ, రాజకీయాలకు అతీతంగా ప్రజల సమస్యల పరిష్కారమే తన ప్రధాన లక్ష్యమని వెల్లడించారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండే సర్పంచ్‌గా పనిచేస్తానని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్, వార్డు సభ్యులు, వివిధ పార్టీల నాయకులు, యువకులు, మహిళలు తదితరులు పాల్గొని నూతన సర్పంచ్‌కు శుభాకాంక్షలు తెలిపారు. దమ్మపేట గ్రామం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించే దిశగా కొత్త పాలన ప్రారంభమైందని గ్రామస్తులు అభిప్రాయం వ్యక్తం చేశారు.

## నూతన సర్పంచ్ చింత రవికి శుభాకాంక్షలు

**జనగామ జిల్లా బిఆర్ఎస్ నాయకులు పళ్ళ సుందర్ రామిరెడ్డి**



**దేవరుప్పుల, విశాలభారతి:** మండలం,కామారెడ్డి గూడెం గ్రామ పంచాయతీ ఎన్నికల్లో ఎన్నికైనా నూతన పాలక వర్గం ప్రమాణ స్వీకార మహోత్సవంలో సర్పంచ్ గా చింత రవి,ఉప సర్పంచ్ గా పులిపంపుల భాస్కర్,వార్డు సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు.వారికి కామారెడ్డి గూడెం కార్యదర్శి అంజలి ప్రమాణ స్వీకారం చేయించారు. ప్రమాణ స్వీకారం అనంతరం బిఆర్ఎస్ జిల్లా నాయకుడు పల్లా సుందర్ రాంరెడ్డి, మాజీ మండల అధ్యక్షుడు బస్వ మల్లేష్,తదితరులు సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు, యువజన నాయకులు, కార్యకర్తలు,గ్రామస్తులు,తదితరులు పాల్గొన్నారు.

## ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతా

- వెంకటాపూర్ సర్పంచ్ అర్చన అజయ్ రెడ్డి |
- స్వతంత్ర అభ్యర్థిగా తిరుగులేని విజయం
- అతి చిన్న వయసులో సర్పంచ్ గా రికార్డు



**మొయినాబాద్, విశాలభారతి:** గ్రామ అభివృద్దే నా ఎజెండా. ప్రజలకి నిరంతరం అందుబాటులో వుండి వారి సమస్యలని పరిష్కారం చేస్తానని మొయినాబాద్ మండలం వెంకటాపూర్ గ్రామ స్వతంత్ర సర్పంచ్ అర్చనా అజయ్ రెడ్డి ఈ రోజు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మొయినాబాద్ మండల విద్యాధికారి మల్లయ్య పాల్గొని సర్పంచ్ , ఉప సర్పంచ్ మరియు వార్డు సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. వెంకటాపూర్ గ్రామంలో అతి చిన్న వయసులో సర్పంచ్ గా గెలవడం ఇదే మొదటిసారి. ఉప సర్పంచ్ ఎలుగుల ప్రభాకర్ , వార్డు సభ్యులు వడ్ల రమేష్ చారి, గడ్డం కల్పనా మహేందర్ , కలిశెట్టి నిర్మలా సురేశ్, మెట్టు స్వాతి మురళి, దుద్యాల నరసింహా, ఎరుపుల శ్రీశైలం, కత్తుల పెంట్రాజ్ మరియు గ్రామ కార్యదర్శి రామకృష్ణ రెడ్డి , ప్రభుత్వ పాఠశాల ప్రిన్సిపాల్ కృష్ణమూర్తి, గ్రామ పంచాయతీ సిబ్బంది, గ్రామ నాయకులు యూత్ సభ్యులు పాల్గొన్నారు.

## ప్రజల సమక్షంలో బీఆర్ఎస్ సర్పంచ్ ప్రమాణ స్వీకారం

- అన్ని రంగాల్లో గ్రామాభివృద్దే లక్ష్యం
- సర్పంచ్ కందికంటి విజయ్ కుమార్



విశాలభారతి, అబ్దుల్లాపూర్ మెట్ : బండరవిరాల గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పరచడమే తన ప్రధాన లక్ష్యమని నూతనంగా ఎన్నికైన బిఆర్ఎస్ సర్పంచ్ కందికంటి విజయ్ కుమార్ తెలిపారు. ఇటీవల నిర్వహించిన గ్రామపంచాయతీ ఎన్నికల్లో విజయం సాధించిన ప్రజా ప్రతినిధులు సోమవారం తమ బాధ్యతలను అధికారికంగా స్వీకరించారు.అబ్దుల్లాపూర్ మెట్ మండలంలోని బండరవిరాల గ్రామ పంచాయతీలో నూతన సర్పంచ్ ప్రమాణ స్వీకార కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కందికంటి విజయ్ కుమార్‌తో పాటు ఉప సర్పంచ్, వార్డు సభ్యులు ప్రజల సమక్షంలో ప్రమాణ స్వీకారం చేశారు. ప్రత్యేక అధికారుల పాలన ముగిసి నూతన పాలకవర్గం అధికారికంగా బాధ్యతలు చేపట్టడంతో గ్రామ పంచాయతీ కార్యాలయం సందడిగా మారింది. ఈ సందర్భంగా సర్పంచ్ కందికంటి విజయ్ కుమార్ మాట్లాడుతూ.. బిఆర్ఎస్ పార్టీ తరఫున పోటీ చేసి ప్రజల ఆశీర్వాదంతో గెలుపొందినందుకు ఆనందంగా ఉందని పేర్కొన్నారు. స్వలాభం కోసం కాకుండా నిరంతరం గ్రామ అభివృద్ధికే అంకితమవుతామని హామీ ఇచ్చారు. గత కొన్ని సంవత్సరాలుగా అభివృద్ధికి నోచుకోని బండరవిరాల గ్రామాన్ని అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్లి ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతామని స్పష్టం చేశారు.తమపై విశ్వాసం ఉంచి గొప్ప బాధ్యత అప్పగించిన బండరవిరాల గ్రామ ప్రజలకు పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు. అలాగే తన గురువు డాక్టర్ ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ బోధించిన క్రమశిక్షణ, రాజ్యాంగబద్ధమైన పాలన స్ఫూర్తితో గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు కృషి చేస్తామని అన్నారు.

## హత్య కేసును ఛేదించిన పోలీసులు



**మేడిపల్లి, విశాలభారతి:** రాచకొండ కమిషనరేట్‌లో మేడిపల్లి పోలీసులు ఒక హత్య కేసును విజయవంతంగా గుర్తించి, బోడుప్పల్‌లోని తూర్పు బృందావన్ కాలనీలో వీజీ అశోక్‌ను గొంతు కోసి చంపిన మృతుడి భార్యతో సహా ముగ్గురు నిందితులను అరెస్టు చేశారు. 12.12.2025న, మృతుడి భార్య జీ. పూర్ణిమ తన భర్త వీజీ అని పేర్కొంటూ ఫిర్యాదు చేశారు. శ్రీనిధి విశ్వవిద్యాలయంలో లాజిస్టిక్ మేనేజర్‌గా పనిచేస్తున్న 45 సంవత్సరాల అశోక్, వారి ఇంటి వాష్‌రూమ్‌లో అపస్మారక స్థితిలో కనిపించాడు మరియు మల్కాజ్‌గిరిలోని ప్రభుత్వ ఆసుపత్రిలో మరణించినట్లు ప్రకటించారు. ప్రారంభంలో ఎటువంటి అనుమానం వ్యక్తం కాలేదు. దీని ప్రకారం, కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. దర్యాప్తులో, మృతదేహంపై అనుమానాస్పద గాయాలు కనిపించాయి, వాటిలో చెంప మరియు మెడపై గాయాలు కూడా ఉన్నాయి, ఇది మరణంపై కొంత అనుమానాన్ని కలిగించింది. సీసీ ఫుటేజ్‌లు మరియు సాంకేతిక ఆధారాల ఆధారంగా నిందితులను అరెస్టు చేశారు. ఈ కేసును రాచకొండ పోలీస్ కమిషనర్ జి. సుధీర్ బాబు, ఐపీఎస్ నాయకత్వంలో మరియు సిహెచ్. ప్రత్యక్ష పర్యవేక్షణలో గుర్తించారు. శ్రీధర్, ఐపీఎస్, డీసీపీ, మల్కాజ్‌గిరి జోన్, మరియు ఎస్. చక్రపాణి, ఏసీపీ, మల్కాజ్‌గిరి డివిజన్. మేడిపల్లి ఎస్‌హెచ్‌ఓ ఆర్.గోవింద రెడ్డి, మేడిపల్లి ఎస్‌హెచ్‌ఓ ఎ.నర్సింగరావు, జి.ఉదయ భాస్కర్, మేడిపల్లి ఎస్ఎస్ పోలీస్ అధికారులు మరియు సిబ్బందితో కూడిన బృందాలు దర్యాప్తులో తీవ్రంగా కృషి చేసి నిందితులను అరెస్టు చేశారు.

# గుజ్జుల శ్రీనివాస్ అనే నేను మందలపల్లి గ్రామపంచాయతీ సర్పంచ్‌గా

- మందలపల్లి సర్పంచ్‌గా గుజ్జుల శ్రీనివాస్ ప్రమాణ స్వీకారం
- గ్రామాభివృద్ధి, పారదర్శక పాలనకు హామీ
- కార్యక్రమంలో ఎమ్మెల్యే జారే, మండల సీనియర్ నాయకులు పర్వతనేని



**అశ్వరావుపేట, విశాలభారతి:**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేట మండలం మందలపల్లి గ్రామపంచాయతీ నూతన సర్పంచ్‌గా గుజ్జుల శ్రీనివాస్ బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా నిర్వహించిన ప్రమాణ స్వీకార కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా గుజ్జుల శ్రీనివాస్ దైవసాక్షిగా ప్రమాణం చేస్తూ గ్రామ ప్రజల సేవే తన పరమ ధర్మమని ప్రకటించారు. "దైవసాక్షిగా నేను గుజ్జుల శ్రీనివాస్, మందలపల్లి గ్రామపంచాయతీ సర్పంచ్‌గా బాధ్యతలు స్వీకరిస్తూ, గ్రామ ప్రజల సేవే నా పరమ ధర్మమని ప్రమాణం చేస్తున్నాను. గ్రామాభివృద్ధి కోసం నిజాయితీతో, పారదర్శకంగా పనిచేస్తాను. పదవిని దుర్వినియోగం చేయకుండా, చట్టాలు-నిబంధనలకు లోబడి పాలన సాగిస్తాను" అని తెలిపారు. గ్రామంలోని ప్రతి కుటుంబానికి సమాన న్యాయం అందేలా కృషి చేస్తానని, కుల, మత, రాజకీయ భేదాలు లేకుండా అందరినీ కలుపుకొని ముందుకు నడిపిస్తానని పేర్కొన్నారు. తాగునీరు, పారిశుద్ధ్యం, రహదారులు, విద్యుత్, ఆరోగ్యం వంటి మౌలిక సదుపాయాల అభివృద్ధే తన ప్రధాన బాధ్యతగా భావిస్తున్నానని స్పష్టం చేశారు. నిరుపేదల సమస్యలను ప్రాధాన్యంగా తీసుకొని పరిష్కరిస్తానని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా కృషి చేస్తానని తెలిపారు. గ్రామ సభలను క్రమం తప్పకుండా నిర్వహించి ప్రజల సూచనలు, అభిప్రాయాలను పాలనలో భాగం చేస్తానని అన్నారు. యువత, మహిళలు, రైతుల అభ్యున్నతికి ప్రత్యేక చర్యలు తీసుకుంటానని, గ్రామాభివృద్ధి కోసం అవసరమైతే మండల, జిల్లా అధికారులతో సమన్వయం చేసుకుంటూ పనిచేస్తానని గుజ్జుల శ్రీనివాస్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న అశ్వరావుపేట నియోజకవర్గ శాసన సభ్యులు జారే ఆదినారాయణ మాట్లాడుతూ, ప్రజల ఆశీర్వాదంతో సర్పంచ్‌గా ఎన్నికైన గుజ్జుల శ్రీనివాస్ గ్రామాభివృద్ధికి కట్టుబడి పనిచేస్తారని విశ్వాసం వ్యక్తం చేశారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను సద్వినియోగం చేసుకొని మందలపల్లిని అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, గ్రామ ప్రజలు సమన్వయంతో పనిచేస్తే గ్రామం ఆదర్శంగా నిలుస్తుందని పేర్కొన్నారు. అదే విధంగా మండల సీనియర్ నాయకులు పర్వతనేని వరప్రసాద్ మాట్లాడుతూ, గుజ్జుల శ్రీనివాస్‌కు గ్రామ ప్రజలు అందించిన విజయం విశ్వాసానికి ప్రతీక అని అన్నారు. సర్పంచ్‌గా బాధ్యతాయుతంగా పనిచేస్తూ ప్రజల సమస్యలను ప్రాధాన్యంగా పరిష్కరించాలని సూచించారు. గ్రామాభివృద్ధికి తమ పూర్తి సహకారం ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా దమ్మపేట ఎస్సై సాయి కిషోర్ రెడ్డి మాట్లాడుతూ, గ్రామంలో శాంతి భద్రతల పరిరక్షణకు పోలీసు శాఖతో పాటు ప్రజాప్రతినిధుల సమన్వయం అవసరమని అన్నారు. గ్రామంలో అక్రమ కార్యకలాపాలకు తావు లేకుండా శాంతియుత వాతావరణం కొనసాగేందుకు గ్రామ పెద్దలు, ప్రజలు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సురేష్, గోపాల్ రావు, ఎస్.కే. రఫీ, రషీద్, శ్రీనివాస్, కిరణ్, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, గ్రామ పెద్దలు, మహిళలు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మైనర్‌పై అత్యాచారం కేసు.. నిందితుడికి జీవిత ఖైదు



**విశాల భారతి, అబ్దుల్లాపూర్ మెట్ :** నాగోల్ పోలీస్ స్టేషన్ పరిధిలో మైనర్ బాలికపై అత్యాచారం చేసిన కేసులో నిందితుడిని నేరస్తుడిగా నిర్ధారించిన న్యాయస్థానం జీవిత ఖైదు శిక్ష విధించింది.కోర్టు వివరాల ప్రకారం.. నిందితుడు దండుల సాయి కుమార్ (తండ్రి: లక్ష్మయ్య), వయస్సు 24 సంవత్సరాలు, వడ్డెర బస్తి, బండ్లగూడ, నాగోల్ నివాసి. తేదీ 16112023 నాడు నాగోల్ జైపురి కాలనీలో ఇంట్లో ఒంటరిగా ఉన్న 16 ఏళ్ల మైనర్ బాలికపై అక్రమంగా ప్రవేశించి లైంగిక దాడికి పాల్పడినట్లు ఆరోపణలు నమోదయ్యాయి. ఈ ఘటనపై బాధితురాలి ఫిర్యాదు మేరకు నాగోల్ పోలీసులు కేసు నమోదు చేసి, విచారణ అనంతరం నిందితుడిని అరెస్ట్ చేసి చార్జ్‌షీట్ దాఖలు చేశారు. ఈ కేసు (ఎస్.సి. నెం. 54/2024)ను రంగా రెడ్డి జిల్లా, ఎల్.బి. నగర్‌లోని రేప్ & పోక్సో స్పెషల్ ఫాస్ట్ ట్రాక్ కోర్టు విచారించింది.ప్రాసిక్యూషన్ వాదనలు, సాక్ష్యాలను పరిశీలించిన న్యాయస్థానం నిందితుడిని దోషిగా తేల్చి జీవిత ఖైదు శిక్షను ఖరారు చేసింది.ఈ కేసులో సమర్థవంతంగా వాదనలు వినిపించిన అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, పోలీస్ సిబ్బందిని రాచకొండ పోలీస్ ఉన్నతాధికారులు అభినందించారు.

# ఘనంగా సంఘం సత్తయ్య రెండో వర్ధంతి

- పేదలకు దుప్పట్లు పంపిణీ
- సంఘం సత్తయ్య సేవలు మరువలేనివి
- జ్యోతి ఎడ్యుకేటెడ్ యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు నూకం కృష్ణ (అంబ్రోస్)



**ఇబ్రహీంపట్నం, విశాలభారతి:** రంగారెడ్డి జిల్లా యాచారం మండలంలోని నందివనపర్తి గ్రామంలో జ్యోతి ఎడ్యుకేటెడ్ యూత్ ఫౌండర్ సంఘం సత్తయ్య రెండో వర్ధంతిని ఆ యూత్ సభ్యులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా యూత్ అధ్యక్షుడు నూకం కృష్ణ (అంబ్రోస్) తో కలిసి కార్యవర్గ సభ్యులు యాచారంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం యూత్ ఆవరణంలోని సంఘం సత్తయ్య విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. యూత్ సభ్యుల ఆధ్వర్యంలో పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నూకం కృష్ణ మాట్లాడుతూ.. జ్యోతి ఎడ్యుకేటెడ్ యూత్ కు సంఘం సత్తయ్య చేసిన సేవలు మరువలేనివని ఆయన సేవలను కొనియాడారు. యూత్ ఆధ్వర్యంలో రానున్న రోజుల్లో మరిన్ని సేవా కార్యక్రమాలు, క్రీడ టోర్నమెంట్లు నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ విజయ్ కుమార్, అడ్వకేట్ యాదయ్య గౌడ్, లక్ష్మి కాంత్ రెడ్డి, రవీందర్ చారి,పండరి గౌడ్, సంఘం , గణేష్, శ్రీనివాస్ తగితరులు పాల్గొన్నారు.

# తాటి లక్ష్మి అనే నేను

- సర్పంచ్‌గా నిజమైన విధేయత కలిగి ఉంటాను
- పండగ సౌజన్య అనే నేను
- ఉప సర్పంచ్ గా భయము,పక్షపాతము లేకుండా ప్రజల కోసం పనిచేస్తాను



**బూర్గంపాడు, విశాలభారతి :** సోంపల్లి గ్రామపంచాయతీ సర్పంచ్ ప్రమాణ స్వీకారం సోమవారం నాడు ప్రత్యేక అధికారి అగ్రికల్చర్ ఏవో శంకర్ అధ్యక్షతన నిర్వహించడం జరిగింది. ముందుగా సర్పంచ్ తాటి లక్ష్మి ప్రమాణ స్వీకారం చేశారు. తెలంగాణ పంచాయతీ రాజ్ చట్టం 2018 మరియు దాని కింద రూపొందించబడిన నియమావలి ప్రకారం నా విధులు మరియు బాధ్యతలను, భయము, పక్షమాతము లేకుండా నిష్టతో మరియు నిజాయితీతో నిర్వహిస్తానని ప్రమాణం చేశారు. అనంతరం ఉప సర్పంచ్ వార్డు మెంబర్లు ప్రమాణ స్వీకారం చేశారు ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి గ్రామ పెద్దలు పండగ రాములు, పండగ రాంబాబు, ఆదర్శ రైతు గాదె నర్సిరెడ్డి మాట్లాడుతూ నిత్యం ప్రజా సమస్యలపై వారి అవసరతలపై పాలకవర్గం దృష్టిసారించాలని సూచించారు. సోంపల్లి గ్రామపంచాయతీని స్వచ్ఛ పంచాయతీగా తీర్చిదిద్దాలని ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరవేయుటలో గ్రామ సర్పంచ్ కీలకపాత్ర పోషించాలని అన్నారు

# సర్పంచిగా ప్రమాణ స్వీకారం చేసిన మందపాటి వెంకటరెడ్డి




**సత్తుపల్లి, విశాలభారతి:** ఖమ్మం జిల్లా వేంసూరు మండలంలోని కందుకూరు గ్రామపంచాయతీలో నూతన పాలకవర్గం నేడు అధికారికంగా బాధ్యతలు స్వీకరించింది. ఇటీవల నిర్వహించిన గ్రామపంచాయతీ ఎన్నికల్లో ప్రజల మద్దతుతో విజయం సాధించిన మందపాటి వెంకటరెడ్డి (చినబాబు) గ్రామ సర్పంచ్‌గా ప్రమాణ స్వీకారం చేశారు. అదే కార్యక్రమంలో గొర్ల ప్రభాకర్రెడ్డి ఉపసర్పంచ్‌గా, బండి జగదీష్‌రెడ్డి సహా వార్డు సభ్యులు తమ పదవులకు ప్రమాణ స్వీకారం చేశారు. గ్రామ పంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన ఈ ప్రమాణ స్వీకార కార్యక్రమం ప్రశాంతంగా, క్రమబద్ధంగా జరిగింది. ఎన్నికల ఫలితాల అనంతరం నూతన పాలకవర్గం బాధ్యతలు చేపట్టడంతో గ్రామంలో ఉత్సాహభరిత వాతావరణం నెలకొంది. స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై నూతన సర్పంచ్‌తో పాటు ఉపసర్పంచ్, వార్డు సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. ప్రమాణ స్వీకారం అనంతరం మందపాటి వెంకటరెడ్డి మాట్లాడుతూ గ్రామ అభివృద్ధే తమ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. కందుకూరు గ్రామాన్ని అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్లేందుకు సమిష్టిగా కృషి చేస్తామని స్పష్టం చేశారు. తాగునీరు, పారిశుధ్యం, అంతర్గత రహదారులు, డ్రైనేజీ వ్యవస్థ, వీధిదీపాల నిర్వహణ వంటి మౌలిక వసతులపై ప్రత్యేక దృష్టి సారిస్తామని తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి కుటుంబానికి అందేలా చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. ఉపసర్పంచ్ గొర్ల ప్రభాకర్రెడ్డి మాట్లాడుతూ గ్రామంలో ప్రజల సమస్యలను గుర్తించి ప్రాధాన్యత క్రమంలో పరిష్కరిస్తామని తెలిపారు. గ్రామ సభల ద్వారా ప్రజల అభిప్రాయాలను తెలుసుకుని నిర్ణయాలు తీసుకుంటామని, పారదర్శక పాలన అందించడమే లక్ష్యమని పేర్కొన్నారు. వార్డు సభ్యులు మాట్లాడుతూ ప్రతి వార్డులోని సమస్యలను సమగ్రంగా అధ్యయనం చేసి దశలవారీగా పరిష్కరిస్తామని తెలిపారు. ప్రమాణ స్వీకార కార్యక్రమం అనంతరం గ్రామపంచాయతీ రికార్డులను నూతన పాలకవర్గం పరిశీలించింది. త్వరలోనే గ్రామాభివృద్ధి కార్యాచరణ ప్రణాళిక రూపొందించి అమలు చేస్తామని వెల్లడించారు. ప్రజల సహకారంతో కందుకూరు గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దడమే తమ సంకల్పమని నూతన పాలకవర్గం స్పష్టం చేసింది.

# నిషేధిత 'చైనీస్ మాంజా'పై ఉక్కుపాదం..!

- బాలానగర్ డివిజన్‌లో స్పెషల్ డ్రైవ్ షురూ..
- అమ్మినా, వాడినా కఠిన చర్యలు తప్పవు - ఏసీపీ నరేష్ రెడ్డి

**కూకట్ పల్లి విశాలభారతి:** నిషేధిత చైనీస్ మాంజా అక్రమ అమ్మకాలు, పంపిణీని అరికట్టేందుకు సైబరాబాద్ పోలీసులు రంగంలోకి దిగారు. సంక్రాంతి పండుగ సమీపిస్తున్న నేపథ్యంలో, సైబరాబాద్ పోలీస్ కమిషనర్ అవినాష్ మొహంతి ఆదేశాల మేరకు బాలానగర్ డీసీపీ సురేష్ కుమార్ పర్యవేక్షణలో బాలానగర్ డివిజన్ పోలీసులు ప్రత్యేక డ్రైవ్‌ను ప్రారంభించారు. ఈ స్పెషల్ ఆపరేషన్ వివరాలను బాలానగర్ ఏసీపీ నరేష్ రెడ్డి వెల్లడించారు. బాలానగర్ డివిజన్ పరిధిలో చైనీస్ మాంజా అమ్మకం, వినియోగం నిల్వ లేదా రవాణాలో పాల్గొన్న వ్యక్తులపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటాం అని ఆయన స్పష్టం చేశారు. ఈ సందర్బంగా ఏసీపీ నరేష్ రెడ్డి మాట్లాడుతూ... చైనీస్ మాంజాను విక్రయించినా గాలిపటాలు ఎగరేసేందుకు ఉపయోగించినా సదరు వ్యక్తులకు జైలు శిక్ష పడే అవకాశం ఉందన్నారు. ప్రతి సంక్రాంతికి ఈ ప్రమాదకరమైన మాంజా కారణంగా ఎంతో మంది మనుషులు చనిపోతున్నారు లేదా తీవ్రంగా గాయపడుతున్నారు. ముఖ్యంగా పక్షులకు, పర్యావరణానికి ఇది తీవ్ర నష్టం కలిగిస్తుంది అన్నారు. పతంగి దుకాణాల యజమానులు పోలీసుల హెచ్చరికలను నిర్లక్ష్యం చేస్తే, వారు కూడా జైలుకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. పిల్లలకు చైనీస్ మాంజా వాళ్ళ కలిగే నష్టాలను తల్లిదండ్రులు విధిగా వివరించి వారికి అవగాహన కల్పించాలన్నారు. "ప్రజలు దీన్ని ఒక సామాజిక బాధ్యతగా భావించాలని, చైనీస్ మాంజా విక్రయాలు లేదా నిల్వ గురించి ఏ సమాచారం తెలిసినా వెంటనే పోలీసులకు తెలియజేయాలని కోరారు. ప్రజల సహకారం లేకుండా ఈ ప్రమాదాన్ని పూర్తిగా అరికట్టడం సాధ్యం కాదని ఏసీపీ నరేష్ రెడ్డి ప్రజలను కోరారు.




# బాటసింగారం విద్యార్థుల రాష్ట్ర కబడ్డీలో ఘన విజయం



**విశాల భారతి, అబ్దుల్లాపూర్ మెట్ :**

అబ్దుల్లాపూర్మెట్ మండల పరిధిలోని బాటసింగారం గ్రామానికి చెందిన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో అద్భుత ప్రతిభ కనబరిచి రెండు ఛాంపియన్‌షిప్‌లను సాధించి గ్రామానికి, పాఠశాలకు గర్వకారణంగా నిలిచారు. ఆదివారం కూకట్‌పల్లి పైల్వాన్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో అండర్ 12, 14 బాలుర విభాగాల్లో దాదాపు 12 జట్లతో తీవ్ర పోటీని ఎదుర్కొని, భారీ పాయింట్ల తేడాతో విజయం సాధించారు. విజేతల జాబితా.. బి. కౌశిక్, ఎం. రాంచరణ్, జి. సుశాంత్, బి. తులసిరామ్, ఏ. రంజిత్, వి. హరీష్, బి. కార్తీక్, సోను,వై. మణికంఠ, ఓ. కార్తీక్, పి. కౌశిక్,ఏ. జాశ్వంత్, జి. బాలాజీ, టి. శివ సర్పంచ్-ఉపసర్పంచ్ అభినందనలు ఈ సందర్భంగా పాఠశాలలో గ్రామ సర్పంచ్ ఎర్రవెల్లి గౌరీ శంకర్, ఉప సర్పంచ్ నార్లకొండ వెంకటేష్‌లు క్రీడాకారులను ఘనంగా అభినందించారు. సర్పంచ్ గౌరీ శంకర్ మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తుకు ఎల్లవేళలా అండగా ఉంటామని, మరింత ఉన్నత స్థాయిలో—జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో పాల్గొని పెద్ద విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. క్రమశిక్షణ విద్యార్థి దశలో అత్యంత ముఖ్యమని, పాఠశాల ఆవరణను తమ ఇంటిలా భావించి చెట్లు నాటి పర్యావరణాన్ని కాపాడాలని సూచించారు. చెడు అలవాట్లు, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, ఉపాధ్యాయులను గౌరవిస్తూ వారు చెప్పే మంచి విషయాలను ఆచరించాలని విద్యార్థులకు హితవు పలికారు.ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన సర్పంచ్ గౌరీ శంకర్, ఉప సర్పంచ్ వెంకటేష్‌లను పాఠశాల సిబ్బంది సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ప్రతాప్, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# జుంజునూరి కృష్ణకుమారి అనే నేను

**సత్తుపల్లి, విశాలభారతి:**



ఖమ్మం జిల్లా వేంసూరు మండలం రామన్నపాలెం గ్రామపంచాయతీ నూతన సర్పంచ్‌గా జుంజునూరి కృష్ణకుమారి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా గ్రామపంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన ప్రమాణ స్వీకార కార్యక్రమం ఘనంగా జరిగింది. సర్పంచ్ కృష్ణకుమారి దైవసాక్షిగా ప్రమాణం చేస్తూ గ్రామ ప్రజల సేవే తన ప్రధాన ధ్యేయమని వెల్లడించారు. ప్రమాణ స్వీకార కార్యక్రమంలో ఉప సర్పంచ్‌గా పుచ్చకాయల శంకర్ రెడ్డి, అలాగే వార్డు సభ్యులు కూడా అధికారికంగా బాధ్యతలు స్వీకరించారు. నూతన పాలకవర్గం బాధ్యతలు చేపట్టడంతో గ్రామంలో ఉత్సాహభరిత వాతావరణం నెలకొంది. గ్రామ పెద్దలు, నాయకులు, మహిళలు, యువత పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ జుంజునూరి కృష్ణకుమారి మాట్లాడుతూ, "దైవసాక్షిగా నేను రామన్నపాలెం గ్రామ సర్పంచ్‌గా బాధ్యతలు స్వీకరిస్తూ, గ్రామ ప్రజల నమ్మకానికి తగ్గట్టుగా పనిచేస్తానని హామీ ఇస్తున్నాను. గ్రామాభివృద్ధి, ప్రజల సంక్షేమమే నా పరమ లక్ష్యం. కుల, మత, రాజకీయ భేదాలకు అతీతంగా అందరినీ కలుపుకొని పాలన సాగిస్తాను" అని పేర్కొన్నారు. గ్రామంలో తాగునీరు, పారిశుద్ధ్యం, అంతర్గత రహదారులు, విద్యుత్ సరఫరా, ఆరోగ్య సేవల మెరుగుదలపై ప్రత్యేక దృష్టి సారిస్తానని తెలిపారు. మహిళలు, యువత, రైతుల అభ్యున్నతికి అవసరమైన చర్యలు తీసుకుంటానని, నిరుపేదల సమస్యలకు ప్రాధాన్యత ఇస్తానని స్పష్టం చేశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా పారదర్శకంగా అమలు చేస్తామని హామీ ఇచ్చారు. ఉప సర్పంచ్ పుచ్చకాయల శంకర్ రెడ్డి మాట్లాడుతూ, సర్పంచ్‌తో కలిసి గ్రామ అభివృద్ధికి సమిష్టిగా పనిచేస్తామని తెలిపారు. వార్డు సభ్యులు కూడా ప్రజల సమస్యలను పాలకవర్గం దృష్టికి తీసుకువచ్చి పరిష్కారానికి కృషి చేస్తామని పేర్కొన్నారు. చివరగా, తనపై విశ్వాసం ఉంచి అవకాశం కల్పించిన గ్రామ ప్రజలకు సర్పంచ్ కృష్ణకుమారి కృతజ్ఞతలు తెలిపారు. రామన్నపాలెం గ్రామాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు నిరంతరం శ్రమిస్తానని దైవసాక్షిగా మరోసారి హామీ ఇస్తూ తన ప్రసంగాన్ని ముగించారు.

# సర్పంచ్‌గా పోలేబోయిన సుజాత ప్రమాణ స్వీకారం

**కరకగూడెం, విశాలభారతి:**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కరకగూడెం మండల కేంద్రంలో కరకగూడెం గ్రామపంచాయతీ సర్పంచ్‌గా పోలేబోయిన సుజాత ఘనంగా ప్రమాణ స్వీకారం చేసి బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే, జడ్పీ చైర్మన్ చందా లింగయ్య దొర, టీపీసీసీ సభ్యులు డాక్టర్.చందా సంతోష్ కుమార్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సయ్యద్ ఇక్బాల్ హుస్సేన్ ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, నూతనంగా ఎన్నుకోబడిన గ్రామ పంచాయతీ పాలకవర్గానికి ముఖ్యంగా సర్పంచ్ పోలేబోయిన సుజాత గారికి శుభాకాంక్షలు అభినందనలు తెలియజేశారు.కరకగూడెం ప్రజల ఆశీస్సులతో నమ్మకంతో గెలిచిన సర్పంచ్ పోలేబోయిన సుజాత గారు గ్రామాల అభివృద్ధి సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తారని విశ్వాసం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రభుత్వ సంక్షేమ విధానాలను గ్రామ స్థాయిలో అమలు చేస్తూ ప్రతి కుటుంబానికి న్యాయం జరిగేలా చూస్తూ, గ్రామ అభివృద్ధిలో సర్పంచ్ సుజాత గారు ముందుండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, మండల కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షులు నాగ బండి వెంకటేశ్వర్లు, మండల నాయకులు ఎర్ర సురేష్, జలగం కృష్ణ, కునుసోత్ సాగర్, ముంజాల సాయిబాబా,గోగ్గలి రవి,షేక్ రఫీ, చందా నాగేశ్వర రావు, చందా వెంకటరత్నమ్మ, జట్ల సత్యం,బిలపాటి సంపత్, దంచనాల రాజేంద్రప్రసాద్, కార్యకర్తలు మహిళలు యువకులు అభిమానులు వివిధ పార్టీ నాయకులు గ్రామస్తులు పెద్దలు తదితరులు పాల్గొన్నారు.



# ప్రతి కాలనీ ఆదర్శంగా తీర్చిదిద్దడమే మా లక్ష్యం

- జీహెచ్‌ఎంసీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ కొప్పుల నర్సింహ్మా రెడ్డి



**విశాలభారతి, ఎల్బీనగర్ :** మన్సూరాబాద్ డివిజన్ హయత్ నగర్ ప్రాంతంలోని విష్ణు నగర్ కాలనీ ,C.S.R కాలనీ ఫేస్ 2 లో మార్నింగ్ వాక్ కార్యక్రమంలో భాగంగా కాలనీ వాసులు ఆహ్వానం మేరకు ఇంకా కాలనీలో మిగిలి ఉన్న సమస్యలను కాలనీవాసులతో కలిసి పర్యటించి అడిగి తెలుసుకున్న GHMC డిప్యూటీ ఫ్లోర్ లీడర్,స్థానిక కార్పొరేటర్ కొప్పుల నర్సింహ్మా రెడ్డి, ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ విష్ణు నగర్ కాలనీలో దాదాపు అన్ని సి.సి రోడ్లు పూర్తి చేసుకోవడం జరిగింది. కొన్ని రోడ్లలో ఇళ్ల నిర్మాణం లేకపోవడంతో, ఇప్పుడు కొత్త కొత్తగా నిర్మించుకున్న ఇళ్ల వద్ద కూడా భూగర్భ డ్రైనేజీ నిర్మించడం జరిగింది. అదేవిధంగా తొందరలోనే సి.సి రోడ్లు నిర్మాణం కూడా పూర్తి చేయిస్తామన్నారు. జాతీయ రహదారి నుండి బృందావన్ కాలనీ,విజయనగర్ కాలనీ మీదుగా విష్ణునగర్ కాలనీ నుండి శివం హిల్స్ కాలనీకి చేరుకునే రోడ్డును కూడా తొందరలోనే నిర్మిస్తున్నామని తెలిపారు. CSR కాలనీలో నూతనంగా ఎన్నికైన సంక్షేమ సంఘ సభ్యులకు హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తూ, ఇంకా కాలనీలో మిగిలి ఉన్న సమస్యలను స్వయంగా కాలనీలో పర్యటించి పర్యవేక్షించడం జరిగింది. అదేవిధంగా వారి యొక్క వినతిపత్రం ద్వారా తెలియపరిచిన సమస్యలను జోనల్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లి అతి తొందరలో సమస్యలను పరిష్కరిస్తారని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు సిహెచ్.సింహాద్రి చారి,శ్రీనివాస్ రెడ్డి,రమేష్ గౌడ్,మధు నాయక్,లింగ స్వామి గౌడ్,రవి గౌడ్, మానియా నాయక్,కృష్ణ రెడ్డి, పక్కెరయ్య,జి.మహేష్, యం.శంకరయ్య, ఉపేందర్,వెంకట్ ,డి.రవి కుమార్, పెద్దిరాజు,ప్రసాద్,అనంత రెడ్డి,రామ్ రెడ్డి,బ్రహ్మ చారి,శ్రీధర్,రత్నాకర్, తదితరులు పాల్గొన్నారు.

# బాలుడు అదృశ్యం



**మేడిపల్లి, విశాలభారతి:** మేడిపల్లి పిఎస్ పరిధిలో జయప్రద కాలనీ చెంగిచెర్లలో నివసించే బీహార్ కు చెందిన మీనాదేవి కుమారుడు రాజ్ కుమార్(09) నెలక్రితం ఇంటిముందు ఆడుకుంటూ తప్పి పోయినాడు అప్పటినుండి ఇంటికి తిరిగి రాలేదు. ఈ విషయంపై వారి తల్లీ మేడిపల్లి పీఎస్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. అబ్బాయి ఎవరికైనా కనిపించిన మేడిపల్లి పి ఎస్ వారికి సమాచారం ఇవ్వగలరు.

# గ్రామాభివృద్దే ధ్యేయంగా పని చేయాలి

- నూతన పాలకవర్గానికి శుభాకాంక్షలు
- టీపీసీసీ జనరల్ సెక్రటరీ నాగా సీతారాములు

**కొత్తగూడెం, విశాలభారతి:** కొత్తగూడెం నియోజకవర్గం, చుంచుపల్లి మండలంలోని చుంచుపల్లి తండా గ్రామపంచాయతీలో నూతన పాలకవర్గ ప్రమాణస్వీకారోత్సవ కార్యక్రమంలో టీపీసీసీ జనరల్ సెక్రటరీ నాగా సీతారాములు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాగా సీతారాములు మాట్లాడుతూ సర్పంచ్ పదవి గ్రామ అభివృద్ధిలో కీలకమైందని, పార్టీలకతీతంగా పనిచేసి గ్రామాలను ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దాలని ఆయన కోరుతూ , కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామాల అభివృద్ధి కి కట్టుబడి ఉందని ఆయన అంటూ , గ్రామాలలో సమస్యలు పరిష్కరించి మంచి పేరు తెచ్చుకోవాలని ఆయన ఆకాంక్షిస్తూ వారికి శుభాకాంక్షలు తెలుపుతూ శాలువాలు కప్పుతూ సన్మానించారు .ఈ కార్యక్రమంలో , కొత్తగూడెం సొసైటీ మాజీ అధ్యక్షులు మండే వీర హనుమంతరావు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కిషన్ ,కొత్తగూడెం ఓబీసీ పట్టణ అధ్యక్షులు జయప్రకాష్,జిల్లా సెక్రటరీ బొబ్బాల వెంకట్ యాదవ్,యువజన కాంగ్రెస్ నాయకులు శివ,మురళి,కోటేష్, వివిధ గ్రామ సర్పంచ్ ,ఉపసర్పంచ్, వార్డ్ మెంబర్స్ గ్రామస్తులు పాల్గొన్నారు .





# బాక్సాఫీస్ లెక్క మార్చిన ‘ధురంధర్’..

**రణ్‌వీర్ ఆ రికార్డు అధిగమిస్తాడా?**

వారం పది రోజులకే అగ్ర కథానాయకుల సినిమాలు సైతం కలెక్షన్స్ లేక చతికలపడుతుంటే, ‘ధురంధర్’ మాత్రం బాక్సాఫీస్ వద్ద దూసుకుపోతున్నాడు. మూడు వారాలు ముగిసినా వసూళ్ల విషయంలో ఎక్కడా తగ్గడం లేదు. గత ఒక్క వారమే సుమారు రూ.100 కోట్లు వసూలు చేసిందంటే మాస్‌లో ఈ సినిమాకు ఉన్న క్రేజ్ ఏంటో ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. మొత్తంగా చూసుకుంటే ఇప్పటి వరకూ రూ.800 కోట్లకు (గ్రాస్) పైగా వసూళ్లు సాధించినట్లు ట్రేడ్ వర్గాలు అంచనా వేశాయి. ఒక పక్క జేమ్స్ కామెరూన్ ‘అవతార్3’ హవా నడుస్తున్నా, ధురంధరుడి జోరు మాత్రం తగ్గడం లేదు. ఈ హవా ఇలాగే మరో రెండు వారాలు కొనసాగితే, రూ.1000 కోట్లు సాధించడం పెద్ద కష్టమేమీ కాదు.

**అత్యధిక వసూళ్లతో మరో రికార్డు..**

క్రికెట్‌లో ఆఖరి బంతి సిక్స్ కొట్టి విజయం సాధిస్తే వచ్చే మజానే వేరు. ఇప్పుడు బాలీవుడ్ పరిస్థితి ఇదే. గత కొన్నేళ్లుగా హిట్‌లు లేక ఆపసోపాలు పడుతున్న హిందీ చిత్ర పరిశ్రమకు ఈ ఏడాది ఆరంభంలో ‘ఛావా’ విజయోత్సాహాన్ని ఇచ్చింది. ఇప్పుడు ఆఖరి నెలలో వచ్చిన ‘ధురంధర్’ ఈ ఏడాది అత్యధిక వసూళ్లు సాధించిన భారతీయ సినిమాగా రికార్డు సృష్టించింది. 2025లో రూ.500 కోట్లు మార్కును దాటిన సినిమాలు ఐదు మాత్రమే ఉండగా అందులో ‘ధురంధర్’ నెం.1లో నిలిచాడు. దాని తర్వాతి స్థానాల్లో ‘కాంతార: చాప్టర్1’ (రూ.850 కోట్లు), ఛావా (రూ.797 కోట్లు), సయారా (రూ.579 కోట్లు) కూలీ, (రూ.514) ఉన్నాయి.

**రణ్‌వీర్ వేగంగా వాళ్లను అధిగమిస్తాడా?**

ప్రస్తుతం రూ.1000 కోట్లకు పైగా వసూళ్లు సాధించిన చిత్రాలు మొత్తం 8 ఉన్నాయి. వీటిలో తెలుగు నుంచి నాలుగు (బాహుబలి2, పుష్ప2, ఆర్ఆర్ఆర్, కల్కి 2898 ఏడీ), హిందీ నుంచి మూడు (దంగల్, జవాన్, పఠాన్), కన్నడ నుంచి ఒక్కటి (కేజీయఫ్: చాప్టర్2) ఉన్నాయి. ‘ధురంధర్’ హవా ఇలాగే కొనసాగితే, ఈ క్లబ్‌లో చేరిన 9వ చిత్రమవుతుంది. అంతేకాదు, టాలీవుడ్ రికార్డును బాలీవుడ్ సమం చేస్తుంది. ‘ధురంధర్’తో రణ్‌వీర్ మరో రికార్డును కూడా సృష్టించడానికి రెడీగా ఉన్నాడు. ‘ధురంధర్2’ను మార్చి 19, 2026న విడుదల చేస్తామని చిత్ర బృందం ఇప్పటికే ప్రకటించింది. ఎలాంటి అవాంతరాలు లేకపోతే, ఈ డేట్‌కు సినిమా రావడం ఖాయం. తొలి భాగం చూసిన వారందరూ పార్ట్2 ఎప్పుడెప్పుడు వస్తుందా? అని ఎదురు చూస్తున్నారు. ఆ సినిమా ఎలా ఉన్నా, మొదటి భాగం తెచ్చిన బజ్‌తో ఆరంభంలోనే అదిరే వసూళ్లు రాబట్టడం ఖాయమని ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. అలా వస్తే, అతి తక్కువ సమయంలో రూ.1000కోట్లు రాబట్టిన కథానాయకుడిగా రణ్‌వీర్ రికార్డు సృష్టిస్తాడు. ప్రభాస్ (బాహుబలి2, కల్కి) ఈ ఫీట్ చేయడానికి చాలా సమయం తీసుకోగా, షారుక్ (జవాన్, పఠాన్)కు ఏడాది సమయం పట్టింది. ఈ లెక్కన రణ్‌వీర్ మూడు, నాలుగు నెలల వ్యవధిలోనే ఈ రికార్డు సృష్టించనున్నాడు.

**తెలుగులో వచ్చేనా?**

సాధారణంగా ఒక భాషలో విడుదలై విజయవంతమైన చిత్రాన్ని వీలైనంత త్వరగా ఇతర భాషల్లోకి డబ్ చేసి, విడుదల చేయడం ఇటీవల సర్వ సాధారణమైపోయింది. మరి, ‘ధురంధర్’ విషయంలో ఈ అడుగు పడిందా? లేదా? అన్నది తెలియటం లేదు. మొదటి వీకెండ్ తర్వాత తెలుగులోనూ మూవీ వస్తుందని టాక్ వినిపించింది. అయితే, మేకర్స్ నుంచి ఎలాంటి ప్రకటనా వెలువడలేదు. హిందీలోనే ఈ మూవీకి మంచి ఆదరణ వస్తున్న నేపథ్యంలో డబ్బింగ్ జోలికి వెళ్లకూడదని భావిస్తున్నారట. అయితే, ‘ధురంధర్2’ని మాత్రం హిందీతో పాటు ఇతర భాషల్లో విడుదల చేయాలని అందుకు తగినట్లుగా మార్పులు చేసుకుంటోంది చిత్ర బృందం.



## మారిన ‘పరాశక్తి’ విడుదల తేదీ..

# సంక్రాంతికి పోటీ ఆసక్తికరం..

శివ కార్తికేయన్, శ్రీలీల ప్రధాన పాత్రల్లో సుధా కొంగర తెరకెక్కిస్తున్న చిత్రం ‘పరాశక్తి’. రవి మోహన్, అథర్వ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఇప్పటికే చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ మూవీ సంక్రాంతి కానుకగా ప్రేక్షకుల ముందుకు రానుంది. తొలుత అనుకున్న షెడ్యూల్ ప్రకారం ఈ చిత్రాన్ని జనవరి 14న విడుదల చేయనున్నట్లు ప్రకటించారు. ఇప్పుడు ఇంకాస్త ముందుగానే ‘పరాశక్తి’ ప్రేక్షకులను పలకరించనుంది. జనవరి 10న ఈ చిత్రం తమిళ, తెలుగు భాషల్లో విడుదల కానుంది. ఈ విషయాన్ని తెలియజేస్తూ చిన్న వీడియోను విడుదల చేశారు. ఆకాశ్ భాస్కరన్‌కు చెందిన డాన్ పిక్చర్స్ రూ.150 కోట్ల బడ్జెట్‌తో ‘పరాశక్తి’ని నిర్మిస్తోంది. ‘పరాశక్తి’ విడుదల తేదీ మారడంతో తమిళ బాక్సాఫీస్ వద్ద ఆసక్తికర పోటీ నెలకొంది. హెచ్.వినోద్ దర్శకత్వంలో విజయ్ నటిస్తున్న ‘జన నాయగన్’ జనవరి 9న విడుదల చేయనున్నట్లు చిత్ర బృందం ప్రకటించింది. అది విడుదలైన ఒకరోజు తర్వాత ‘పరాశక్తి’ వస్తున్నట్లు ప్రకటించడంతో తమిళ బాక్సాఫీస్ లెక్కలు మారాయి. రెండు భాషల్లో విడుదలవుతున్న ‘పరాశక్తి’కి తెలుగులో థియేటర్స్ దొరకడం కాస్త కష్టమే. ఎందుకంటే సంక్రాంతి పండగ మూడు రోజులు ఇక్కడ వరుస సినిమాలు సందడి చేయనున్నాయి. ఈ క్రమంలో అప్పుడు రావడం సరైన నిర్ణయం కాదని చిత్ర బృందం భావించింది. దీంతో విడుదల తేదీని కాస్త ముందుకు జరిపినట్లు తెలుస్తోంది. తెలుగులో జనవరి 9న ప్రభాస్ ‘ది రాజా సాబ్’, జనవరి 12న చిరంజీవి ‘మన శంకరవరప్రసాద్‌గారు’, జనవరి 13న ‘భర్త మహాశయులకు విజ్ఞప్తి’, జనవరి 14న ‘నారీ నారీ నడుమ మురారి’, జనవరి 14న ‘అనగనగా ఒక రాజు’ చిత్రాలు సందడి చేయబోతున్నాయి.




## భువినుంచి దిగివచ్చిన

# దేవకన్యానా..?

**ట్రెడిషనల్ లుక్‌లో మెస్మరైజ్ చేస్తున్న రామ్ హీరోయిన్**

‘నన్ను దోచుకుందువటే’ మూవీతో టాలీవుడ్ ప్రేక్షకులకు పరిచయం అయిన నభా నటేష్ గురించి స్పెషల్‌గా చెప్పాల్సిన పనిలేదు. ఆ తర్వాత ‘అదుగో’అనే సినిమాలో నటించింది. కానీ ఈ చిత్రం అంతగా విజయం సాధించలేకపోయింది. ఆ తర్వాత ఎనర్జిటిక్ స్టార్ రామ్ నటించిన ‘ఇస్మార్ట్ శంకర్’ మూవీతో ఫుల్ ఫామ్‌లోకి వచ్చింది. దీంతో ఈ చిన్నదానికి వరుస ఆఫర్లు క్యూ కట్టాయి. అలా ‘డిస్కో రాజా’, ‘సోలో బ్రతుకే సో బెటర్’, డార్లింగ్ వంటి చిత్రాల్లో నటించి మెప్పించింది. ప్రస్తుతం నిఖిల్సరసన ‘స్వయంభు’ మూవీలో నటిస్తోంది. అలాగే సోషల్ మీడియాలో ఫుల్ యాక్టీవ్‌గా ఉంటూ తన అందచందాలతో కుర్రకారుకు అందాల విందును వడ్డిస్తుంది. ఈ క్రమంలో ఈ భామ పోస్ట్ నెట్టింట వైరల్‌గా మారింది. తాజాగా నభా నటేష్ తన ఇన్‌స్టా వేదికగా కొన్ని ఫొటోలు షేర్ చేసింది. అందులో మెరూన్ కలర డ్రెస్సులో ట్రెడిషనల్‌గా రెడీ అయింది. పెద్ద పెద్ద ఇయర్ రింగ్స్, చేతులకు గాజులు, పాపిట బిళ్ళ పెట్టుకొని మంచిగా కనిపించింది. ఇక వీటికి.. ‘నా ఇంటి వెనుక ప్రాంగణం నుండి కొన్ని సౌందర్యాలను మీ ఫీడ్ కు తీసుకువస్తున్నాను’ అని రాసుకొస్తూ హార్ట్ సింబల్ జోడించింది. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన పిక్స్ నెట్టింట వైరల్‌గా మారగా.. వీటిని చూసిన నెటిజన్లు భువినుంచి దిగివచ్చిన దేవకన్య నా.. అప్సరస నా అని కామెంట్స్ చేస్తున్నారు.



# మళ్లీ తిరిగొస్తానని అనుకోలేదు: శివ రాజ్‌కుమార్

తన కొత్త సినిమా ‘45’ ప్రమోషన్స్‌లో భాగంగా కన్నడ ప్రముఖ నటుడు శివరాజ్‌కుమార్ చెన్నై సందర్శించారు. అక్కడ నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో.. క్యాన్సర్ సర్జరీ రోజులను గుర్తుచేసుకున్నారు. మళ్లీ తిరిగి వస్తానని అనుకోలేదని పేర్కొన్నారు. వైద్యులు దేవుళ్లలా తనకు పునర్జన్మ ఇచ్చారన్నారు. “గతేడాది డిసెంబరులో ట్రీట్‌మెంట్ కోసం యూఎస్ వెళ్లా. ఆ టైమ్‌లో ఎప్పుడూ లేనంతగా ఎమోషనల్ అయ్యా. సర్జరీ తర్వాత ఐదారు గంటలకు స్పృహలోకి వచ్చా. ‘మళ్లీ ఇలా నీ చేయి పట్టుకుంటానో లేదో అనిపించింది’ అని నా భార్యతో చెప్పా. మళ్లీ మామూలు మనిషిని కావడానికి కొంత సమయం పట్టింది. భారత్‌లో అడుగుపెట్టిన క్షణం భావోద్వేగానికి గురయ్యా. నా యోగక్షేమాల గురించి తెలుసుకునేందుకు ఎవరైనా ఫోన్ చేసినా కళ్లలో నీళ్లు తిరిగేవి. ఇలాంటి ప్రేమ ఎవరికి దక్కుతుంది? కావాల్సినంత డబ్బు సంపాదించొచ్చుగానీ ప్రేక్షకుల అభిమానం పొందడం కష్టం” అని అన్నారు. క్యాన్సర్‌పై తన పోరాటాన్ని తెలియజేసేలా డాక్యుమెంటరీ రానుందని శివ రాజ్‌కుమార్ ఇటీవల తెలిపారు. అర్జున్ జన్యా తెరకెక్కించిన ‘45’ సినిమా కన్నడలో ఈ నెల 25న, తెలుగులో 2026 జనవరి 1న విడుదల కానుంది. ఈ సినిమాలో ఉపేంద్ర, రాజ్ బి.శెట్టి కీలక పాత్రలు పోషించారు. రామ్‌చరణ్ హీరోగా తెరకెక్కుతున్న ‘పెద్ది’ లో శివ రాజ్‌కుమార్ కీ రోల్ చేస్తున్న సంగతి తెలిసిందే. ఈ మూవీ వచ్చే ఏడాది మార్చి 27న రిలీజ్ కానుంది.

Published by Rajini Pagilla on behalf of Keerthi Media House, Editor : Gaddam Shyam. RNI No - APTEL/2010/32877.